Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు పసమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక


website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :298 | సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | శనివారం 21 ఫిబ్రవరి 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


## అజారుద్దీన్ కు పదవీ గండం



**హైదరాబాద్, ఫిబ్రవరి 20:**అనూహ్యంగా మంత్రి అయిన అజారుద్దీన్‌ను పదవీ గండం వెంటాడుతోంది. గతేడాది జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటికే మూడున్నర నెలలు గడిచిపోయింది. కానీ అజార్ ఇప్పటివరకు అటు అసెంబ్లీకి కానీ..ఇటు మండలికి కానీ ఎన్నిక కాలేదు. ఆరు నెలల్లోపు ఏదో సభకు ఎన్నిక కాకపోతే ఆయన పదవి ఊస్ట్ అవడం పక్కా.దీంతో అజారుద్దీన్ విషయంపై కాంగ్రెస్ పెద్దలు పెద్ద కసరత్తే చేస్తున్నారట. అజారుద్దీన్‌ను పదవీ గండం నుంచి గట్టెక్కించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ స్కెచ్ వేస్తున్నారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు - మిగతా3లో

## మళ్లీ తెరపైకి సెంటిమెంట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20:**తెలంగాణ రాజకీయాలు మరోసారి సెంటిమెంట్ చుట్టూ తిరుగుతున్నాయి. దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని పాలించిన భారత్ రాష్ట్ర సమితి, ప్రస్తుతం అధికారాన్ని కోల్పోయిన తర్వాత మళ్ళీ పాత అస్త్రాన్నే నమ్ముకుందా? అంటే అవుననే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా మాజీ మంత్రి, ప్రస్తుత కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. కేసీఆర్ సెంటిమెంట్ రాజకీయాలపై ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి.కడియం శ్రీహరి ప్రధానంగా కేసీఆర్ సెంటిమెంట్ వైఖరిని తప్పుపట్టారు. తెలంగాణ సెంటిమెంట్ అనేది కేసీఆర్ సొత్తు కాదని స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో సెంటిమెంట్ ప్రజల ఆకాంక్ష అని, కానీ ఇప్పుడు అది కేవలం రాజకీయ మనుగడ కోసం వాడుకుంటున్న సాధనంగా మారిందని ఆయన ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు లేని సెంటిమెంట్, ఓడిపోయిన వెంటనే కేసీఆర్‌కు గుర్తుకు రావడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కంటే భావోద్వేగాల ద్వారానే



పబ్బం గడుపుకోవాలని చూడటం సరికాదనేది శ్రీహరి వాదన. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, ప్రతిసారీ సెంటిమెంట్ పేరుతో ఓట్లు అడగడం చెల్లదని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు - మిగతా3లో

## 'ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం..

### హైదరాబాద్ అనువైన ప్రదేశం

**: ఏఐ సదస్సులో రేవంత్ రెడ్డి**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి**

**ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్ష**

**జీఎస్టీ కౌన్సిల్‌లా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :** ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు.

**ఏఐ సమ్మిట్‌లో పాల్గొన్న సీఎం..**

ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇవాళ(శుక్రవారం) పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో



ప్రస్తావించారు. ఏఐ - మిగతా3లో

## కవిత పార్టీ టీపీజేపీ?

**హైదరాబాద్, ఫిబ్రవరి 20:**ఈ ఏడాది మేలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన సంగతి తెలిసిందే. మే మొదటి వారంలో ముహూర్తం చూసుకుని పార్టీ పేరు ప్రకటిస్తామని, పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని కూడా హింట్ ఇచ్చారామె. అంతేకాదు వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని.. నా మొదటి ఛాయిస్ సిద్ధిపేట.. రెండో ఛాయిస్ బోధన్ అని కవిత చెప్పారు. ఈ క్రమంలో కవిత పార్టీ పేరు ఇదే అన్న ప్రచారం జరుగుతోంది. కవిత తన పార్టీ పేరును టీపీజేపీ గా నిర్ణయించినట్లు తెలుస్తోంది.తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నామకరణం - మిగతా3లో



## అదిలాబాద్ కు కొత్త ఎయిర్ పోర్టు



**అదిలాబాద్, ఫిబ్రవరి 20:**ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుంది. జిల్లాలో కొత్తగా ఎయిర్‌పోర్టు కానుంది. ఈ మేరకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ గోడం నగేష్ విడుదల చేశారు. త్వరలోనే భూసేకరణ పనులు ప్రారంభం అవుతాయని ఎంపీ వెల్లడించారు. ఈ ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో మరికొన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణ పనులు మట్నదలయ్యాయి. తాజాగా.. ఆదిలాబాద్ విమానాశ్రయంపై కూడా కీలక అప్డేట్ వచ్చింది.ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్‌కు అనుమతి వచ్చిందని ఎంపీ గోడం నగేష్ వెల్లడించారు. త్వరలో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఎయిర్‌పోర్టు మాస్టర్ ప్లాన్ ప్రతిని మీడియా ముందు విడుదల చేశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు మరో 10 వేల ఎకరాల గుర్తింపునకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు రంగంలోకి దిగాక.. మాస్టర్ ప్లాన్‌లో కొంత మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని చెప్పారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయాలను వెల్లడించారు.'ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందింది. జిల్లా ప్రజలకు - మిగతా3లో

## 800 రోజులు పూర్తయినా.. అమలు కాని ఆరు గ్యారెంటీలు

**సిద్దిపేట:**సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ప్రారంభించారు.హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తయింది. ఆనాడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, రేవంత్ రెడ్డి అందరూ బాండ్ పేపర్ల మీద రాసిచ్చి 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారు. కానీ, 100 రోజులు కాదు కదా.. 800 రోజులు పూర్తయినా ఇప్పటికీ ఆరు గ్యారెంటీలు అమలవుతున్న దాఖలాలు లేవని అన్నారు.ఎస్సీ డిక్లరేషన్ పేరిట దళితులకు 18% రిజర్వేషన్లు, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని మోసం చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10,000, ఇంటర్ పాస్ అయితే రూ. 25,000, డిగ్రీకి రూ. 50,000, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి.. ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం కేసీఆర్ గారు ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కూడా రావడం లేదని అన్నారు.కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభకు సిద్దరామయ్య ని తీసుకొచ్చి, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని,



ఏటా రూ. 20,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపింది. వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ అని చెప్పి రాహుల్ గాంధీ - మిగతా3లో



## రాజ్యసభలో తెలంగాణ బిల్లు పాసై 12 ఏళ్లు..

**హరీశ్ రావు పోస్టు**

**హైదరాబాద్:** రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నేటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేత - మిగతా3లో

## ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ప్యాక్స్ సిలికా ఒజూప్పందంపై భారత్

**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ప్యాక్స్ సిలికా తో ఇవాళ భారత్ ఒప్పందం కుదుర్చుకున్నది. ప్యాక్స్ సిలికా డిక్లరేషన్‌పై రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో రెండు దేశాలు ఈ వ్యూహాత్మక ఒప్పందంపై సంతకాలు చేశాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా ప్రతినిధి సెర్గియో గోర్ సమక్షంలో ఈ డిక్లరేషన్‌పై సంతకం చేశారు. అమెరికా ఆర్థిక వ్యవహారాల మంత్రి జాకబ్ హెల్‌బర్గ్ కూడా పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌పై నమ్మకం కలిగే రీతిలో ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారని, మన ఐటీ సామర్థ్యాన్ని, ట్యాలెంట్‌ను ప్రపంచ దేశాలు విశ్వసిస్తున్నాయని, మన విదేశీ విధానం కూడా అందరిలో నమ్మకం కలిగిస్తోందని మంత్రి వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్ల సరఫరా, ఉత్పత్తి, చిప్ డిజైన్ అన్నీ ప్యాక్స్ సిలికాలో భాగస్వామ్యం అవుతాయని మంత్రి అన్నారు. భారతీయ ఇంజినీర్లు అడ్వాన్స్‌డ్ నానోమీటర్ చిప్‌లను డిజైన్ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల పరిశ్రమలకు సుమారు పది లక్షల మంది నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్ అవసరం ఉంటుందన్నారు. అయితే ఆ స్థాయికి అవసరమైన వర్క్‌ఫోర్స్‌ను ఇండియా అందిస్తుందన్నారు. ప్యాక్స్ సిలికా




గ్రూపును గత ఏడాది డిసెంబర్‌లో అమెరికా లాంచ్ చేసింది. దీంట్లో కొన్ని కీలకమైన టెక్నాలజీ భాగస్వామ్యులు ఉన్నారు. ప్యాక్స్ సిలికా బృందంలో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, నెదర్లాండ్స్, యూకే, ఇజ్రాయిల్, యూఏఈ, ఆస్ట్రేలియా దేశాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, ఇన్నోవేటివ్ సిలికాన్, కృత్రిమ మేధ వ్యవస్థను రూపొందించే ఉద్దేశంతో ప్యాక్స్ సిలికా మొదలుపెట్టారు.

# సంపాదకీయం

## ఏఐ క్యాపిటల్‌గా భారత్

అమెరికా వాణిజ్య ఆధిపత్యం, చైనా ఒంటెత్తు పోకడలకు భిన్నంగా భారత్ ఒక 'మూడవ మార్గాన్ని' ప్రపంచానికి పరిచయం చేయబోతున్నదని చెప్పవచ్చు. కీలకమైన సంస్థల డేటా సెంటర్లు ఇండియాలో ఏర్పాటు చేస్తుండటంతో అంతర్జాతీ యంగా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా పనిచేయాలి? దాని పరిమితులు పరిధులు కూడా నిర్ణయించే దిశగా అడుగులు వేస్తున్నది. ఈ సదస్సు చివరిరోజున అంటే ఫిబ్రవరి 20వ తేదీన భారత్ 'ఢిల్లీ డిక్లరేషన్' పేరిట ఓ డ్రాఫ్ట్ విడుదల చేయ బోతున్నది. అది భవిష్యత్తులో ఏఐ ఎలా పనిచేయాలన్న విధివిధానాలకు మార్గదర్శకంగా నిలవబోతున్నది. ఇప్పటికే ప్రధాని డీప్ ఫేక్ లాంటి సమస్యలను బహిరంగంగానే లేవనెత్తారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఎలా ఉండాలన్నది డిక్లరేషన్‌లో చర్చకు రానున్నది. ఇక ఏఐ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం కాకు దదని.. ఆఫ్రికా వంటి పేద దేశాలకు కూడా అందేలా చూడాలని పిలుపు ఇవ్వనున్నారు.. మొత్తంగా ఏఐకి భారత్ క్యాపిటల్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతిమంగా భారత్ ఇప్పుడు కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదు.. ఏఐ ప్రపంచానికి మార్గదర్శి లేదా దిక్సూచిగా మారబోతోంది. భారత్ ఏఐ హబ్‌గా మారడానికి ఉన్న అవకాశాలు మరే దేశానికీ లేవన్నది వాస్తవం. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. డేటా వైవిధ్యం.. భారత్‌లోని భాషలు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులు ఏఐ అల్గారిథమ్స్ శిక్షణకు అద్భుతమైన ముడిసరుకు.. ఇక్కడ ఒక ఏఐ మోడల్ సక్సెస్ అయిందంటే, అది ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయగలదని అంతర్జాతీయంగా పేరొందిన టెక్ కంపెనీలు నమ్ముతున్నాయి. అందుకే అమెరికాలోనే ఉచితంగా ఇవ్వని ఏఐ అత్యాధునిక మోడళ్లను ఇక్కడ ఉచితంగా అందజేస్తున్నాయి. ఇక డెమోగ్రాఫిక్ డివిడెండ్.. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభాతోపాటు ఇంగ్లిష్ మాట్లాడే సాంకేతిక నిపుణులు భారత్ సొంతం. ఇది అంతర్జాతీయ సంస్థలను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. దీంతో పాటు ప్రధానమైన మరో అంశం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. యూపీఐ లాంటి వ్యవస్థల ద్వారా సామాన్యుడిని డిజిటల్ పరిధిలోకి తెచ్చిన అనుభవం భారత్‌కు ఉంది. ఇప్పుడు అదే స్ఫూర్తితో 'ఇండియా ఏఐ మిషన్' సాగుతున్నది. కొన్నేళ్ల క్రితమే భారత ప్రభుత్వం ఒక నిబంధన తెచ్చింది. 'భారతీయుల డేటా (ముఖ్యంగా బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు) భారత గడ్డపై ఉన్న సర్వర్లలోనే ఉండాలి.' దీంతో గతంలో అమెరికా లేదా సింగపూర్‌లో సర్వర్లు పెట్టుకున్న గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు తప్పనిసరిగా భారత్‌లో డేటా సెంటర్లు నిర్మించా ల్సి వచ్చింది. ఇది ఒక ముందస్తు 'మాస్టర్ ప్లాన్'. అందుకోసమే ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం డేటా సెంటర్ల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విదేశీ క్లౌడ్ కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు పెట్టి ఇక్కడి నుండి ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తే, వారికి 2047 వరకు పన్ను మినహాయింపులు ప్రకటించింది. డేటా సెంటర్లను 'మౌలిక సదుపాయాల' జాబితాలో చేర్చడం వల్ల వీరికి తక్కువ వడ్డీకే రుణాలు దొరుకుతున్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్, ముంబై, పుణె ప్రాంతాల్లో సుమారు 21.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నది. విశాఖపట్నంలో గూగుల్ తన మొదటి పూర్తిస్థాయి 'ఏఐ హబ్'ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్లు కేటాయించింది. రిలయన్స్, అదానీ వంటి స్వదేశీ దిగ్గజాలు కూడా గిగావాట్ స్థాయి డేటా సెంటర్లను గుజరాత్, మహారాష్ట్ర తోపాటు ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మిస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా సెంటర్ నిర్వహణ ఖర్చు (ముఖ్యంగా లేబర్, కన్స్ట్రక్షన్) చాలా తక్కువ. భారత్ సౌర విద్యుత్ రంగంలో దూసుకుపోతున్నది. డేటా సెంటర్లకు కావలసిన భారీ విద్యుత్తును గ్రీన్ ఎనర్జీ ద్వారా అందించడం వల్ల అంతర్జాతీయ కంపెనీలకు తమ 'కార్బన్ ఫుట్‌ప్రింట్' తగ్గించుకునే అవకాశం దొరుకు తోంది. 'డేటా ఇస్ ద న్యూ ఆయిల్' అని మనందరికీ తెలుసు.. ఆ చమురును నిల్వ చేసే 'ట్యాంకర్లే' ఈ డేటా సెంటర్లు.. భారత్ ఇప్పుడు ప్రపంచానికి డిజిటల్ గిడ్డంగిగా మారబోతున్నది. ఏఐ వల్ల కలిగే లాభాల కంటే, దాని మిస్ యూజ్ గురించిన ఆందోళనలే ఎక్కువ. అందుకే నియమ నిబంధనల విషయంలో భారత్ కఠినంగా వ్యవహరించనున్నది. భారతీయ వినియోగదారుల డేటా భారత గడ్డపైనే ఉండాలి. విదేశీ సంస్థలు మన డేటాను 'టెస్టింగ్ ల్యాబ్'గా వాడుకోవచ్చు కానీ, దానిని మనకు వ్యతిరేకంగా వాడకుండా చూడాలి. జర్నలిజం రంగంలో ఏఐ వల్ల తప్పుడు వార్తలు వ్యాపించే ప్రమాదం ఉంది. దీనిని అరి కట్టేలా ఏఐ కంటెంట్‌కు 'డిజిటల్ వాటర్‌మార్క్' తప్పనిసరి చేసే దిశగా చట్టాలు రాబోతున్నాయి. ముఖ్యంగా బ్యాం కింగ్, వైద్యం వంటి రంగాల్లో ఏఐ వాడకంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ అవసరం. అంతేకాకుండా కొన్ని దశాబ్దాల కిందట భారతదేశం మెడికల్ డ్రగ్ ట్రయల్స్‌కు బలైంది.. గతంలో జరిగిన 'డ్రగ్ ట్రయల్స్' చేదు జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు జరుగుతున్న 'డేటా ట్రయల్స్' విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. ప్రజలు సమాచారాన్ని పంచుకోవడానికి సిద్ధం గా ఉన్నప్పటికీ, ఆ సమాచారం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. డేటా సెంటర్లు సహా ఇతర వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఎన్ని రాయితీలు ఇచ్చినా డేటా దుర్వినియోగం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నది.

# నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

## -మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష

మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్ రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం




బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది. తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు. 1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు. తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.

# మేడ్ ఇన్ ఇండియా గ్లాసెస్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా భారతదేశంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వేగవంతమైన పురోగతి మధ్య, ఒక కొత్త, ఆసక్తికరమైన ఆవిష్కరణ ఉద్భవించింది. ఇటీవల, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది. సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది. ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో ఒక ప్రత్యేకమైన స్మార్ట్ గ్లాసెస్ ధరించి కనిపించారు. సర్వమ్ కేజ్ అని పిలిచే ఈ గ్లాసెస్‌ను భారతీయ స్టార్టప్ సర్వమ్ ఏఐ అభివృద్ధి చేసింది. ఇవి సాధారణ గ్లాసెస్ కాదు, కానీ మానవుడిలా తక్షణమే వినగల, అర్థం చేసుకుని స్పందించగల స్మార్ట్ పరికరం. ఈ సాంకేతికత భవిష్యత్తులో ఏఐ మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారబోతోందని సూచిస్తుంది. సర్వమ్ కేజ్ అనేది ఏఐ-ఆధారిత స్మార్ట్‌గ్లాస్, దీనిని ధరించినప్పుడు, వినియోగదారునికి వ్యక్తిగత డిజిటల్ అసిస్టెంట్ ఉన్న అనుభవాన్ని అందిస్తుంది. ఈ పరికరం నిజ సమయంలో పనిచేస్తుంది. అంటే మీరు ఏమి చూస్తున్నారో లేదా చెబుతున్నారో అది తక్షణమే అర్థం చేసుకుంటుంది, ప్రతిస్పందిస్తుంది. ఇప్పటివరకు మం మొబైల్ ఫోన్లు లేదా కంప్యూటర్ల ద్వారా ఏఐని ఉపయోగించాము. కానీ ఈ గ్లాసెస్ ఏఐని నేరుగా మన కళ్ళకు తీసుకువస్తున్నాయి. ఇది నిరంతరం స్క్రీన్‌ను చూడవలసిన అవసరాన్ని తొలగిస్తుంది, ఇది మన పనిని చాలా సులభతరం చేస్తుందంటున్నారు నిపుణులు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్



సమ్మిట్ సందర్భంగా ఇండియన్ ఏఐ స్టార్టప్ సర్వమ్ ఏఐ తన రాబోయే స్మార్ట్‌గ్లాసెస్ సర్వమ్ కేజ్ గురించి వివరించారు. కంపెనీ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్ కుమార్ ఈ పరికరం ఏఐని నేరుగా రోజువారీ జీవితంలోకి తీసుకురావడానికి రూపొందించినట్లు ఒక టీజర్ వీడియోను విడుదల చేశారు. ఈ స్మార్ట్‌గ్లాసెస్ ధరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను కూడా వేదికపై షేర్ చేశారు. కంపెనీ ప్రకారం, ప్రధానమంత్రి మొదట వాటిని ప్రయత్నించారు. సర్వమ్ కేజ్‌అతిపెద్ద బలం దాని స్మార్ట్ ఫీచర్లలో ఉంది. ఇవి సాధారణ గాడ్జెట్‌ల నుండి వేరు చేస్తాయి. ఇది మీ ముందు ఉన్న దాన్ని చూడగల చిన్న కెమెరాను కలిగి ఉంటుంది. ఇది రికార్డ్ చేయడమే కాకుండా, ఏఐతో అర్థం చేసుకుని ప్రతిస్పందిస్తుంది. మీరు ఏదైనా అడిగితే, ఈ గ్లాసెస్ తక్షణమే సమాచారాన్ని అందించగలవు. మరో ప్రత్యేకత ఏమిటంటే ఇది పూర్తిగా వాయిస్ ద్వారా పని చేస్తుంది. మీరు ఏ బటన్లను నొక్కాల్సిన అవసరం లేదు. ఇది మీరు చెప్పేది అర్థం చేసుకుంటుంది. దానికి అనుగుణంగా స్పందిస్తుంది. ఇది ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానం అంతగా తెలియని వారికి ఉపయోగించడం చాలా సులభం చేస్తుంది. మరో ముఖ్యమైన లక్షణం రియల్-టైమ్ ప్రతిస్పందన. దీని అర్థం మీరు ఏ ప్రశ్నకైనా తక్షణ ప్రతిస్పందనను పొందుతారు. మీరు దిశలను అడిగినా లేదా సమాచారం అవసరమైనా, ప్రతిదీ ఆలస్యం లేకుండా సహాయపడుతుంది. అదనంగా, ఈ గ్లాసెస్ ఫోటోలు, వీడియోలను కూడా రికార్డ్ చేయగలవు. మీరు మీ ఫోన్‌ను బయటకు తీయవలసిన అవసరం లేదు. మీరు చూస్తున్న వాటిని నేరుగా రికార్డ్ చేయవచ్చు. ఈ ఫీచర్ ముఖ్యంగా ప్రయాణించే లేదా కంటెంట్‌ను సృష్టించే వారికి ఉపయోగపడుతుంది. మరో ప్రత్యేక లక్షణం ఏమిటంటే దీనికి స్క్రీన్ అవసరం లేదు. ఇది ఆడియో ద్వారా సమాచారాన్ని అందిస్తుంది, మీ దృష్టిని, మీ పరిసరాలను కేంద్రీకరించి ఉంచుతుంది. ముఖ్యంగా, ఈ పరికరం భారతీయ భాషల కోసం కూడా అభివృద్ధి చేయడం జరుగుతోంది. దీని అర్థం ఇది హిందీ సహా ఇతర భాషలలో పనిచేయగలదు. ఇది భారత్ వంటి దేశానికి చాలా ముఖ్యమైనది. భారత్ మండపంలో జరిగిన ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ స్మార్ట్ గ్లాసెస్ ధరించి వాటి గురించి తెలుసుకున్నారు. ప్రధానమంత్రి మోదీ కొత్త టెక్నాలజీని ఉపయోగించినప్పుడు, అది దాని ప్రాముఖ్యతను ప్రదర్శించింది. భారతదేశంలో అభివృద్ధి చేసిన టెక్నాలజీలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, స్వావలంబన కోసం కృషి చేస్తోందని ఇది సూచిస్తుంది. సర్వం ఏఐ వ్యవస్థాపకుడు దీనిని ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. సర్వమ్ ఈ స్మార్ట్ గ్లాసెస్‌ను అభివృద్ధి చేయడమే కాకుండా, అనేక రంగాలలో కూడా పనిచేస్తోంది. ఈ కంపెనీ భారతీయ భాషల కోసం స్పీచ్ మోడల్‌లను అభివృద్ధి చేస్తోంది. అదనంగా, ఇది డాక్యుమెంట్లను డిజిటలైజ్ చేయడంలో సహాయపడే సర్వమ్ అక్షర్, వివిధ భాషలలో కంటెంట్‌ను సృష్టించడంలో సహాయపడే సర్వమ్ స్టూడియో వంటి ఇతర ఉత్పత్తులను అభివృద్ధి చేసింది. సారస్ అనే స్పీచ్ మోడల్ కూడా అభివృద్ధి చేయడం జరిగింది. ఇది స్వరాలను బాగా గుర్తించగలదు. ఇవన్నీ భారతదేశం కోసం ప్రత్యేకంగా దాని ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. భారత ప్రభుత్వం ఏఐని ప్రోత్సహించడానికి మిషన్‌ను ప్రారంభించింది. ఈ మిషన్ కింద వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారు. దేశంలో ఏఐ పరిశోధనను బలోపేతం చేయడం, స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం, కొత్త టెక్నాలజీలను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం. ఈ మిషన్ కింద, భారతీయ భాషా ఆధారిత ఏఐ నమూనాలను అభివృద్ధి చేయడానికి అనేక బృందాలను ఎంపిక చేశారు. పరిశోధన, అభివృద్ధిని వేగవంతం చేయడానికి వేలాది ¤ఖ లు కూడా అందుబాటులో ఉంచారు. సర్వం కేజ్ వంటి ఉత్పత్తులను ఈ మిషన్‌లో భాగంగా పరిగణించవచ్చు, భారతదేశం ఇప్పుడు ఏఐ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఇది నిరూపిస్తుంది. సర్వం కేజ్ లాంటి స్మార్ట్ గ్లాసెస్ భవిష్యత్తులో మన జీవితాలను గణనీయంగా మార్చగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ సాంకేతికత ప్రజల పనిని సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది. విద్యలో, విద్యార్థులు దీనిని నేర్చుకోవడానికి ఉపయోగించవచ్చు. ఆరోగ్య సంరక్షణలో, వైద్యులు రోగి సమాచారాన్ని తక్షణమే యాక్సెస్ చేయగలరు. వ్యాపారంలో, ఇది ప్రజలు వేగంగా నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, ఈ సాంకేతికత డిజిటల్, వాస్తవ ప్రపంచానికి మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది. సమాచారాన్ని యాక్సెస్ చేయడానికి మనకు ఇకపై ప్రత్యేక పరికరం అవసరం లేదు, బదులుగా, అదే పరికరం అన్ని సమయాల్లో మనతో ఉంటుంది.

# అయోధ్య... ఆర్థిక అజెండా

**లక్నో, ఫిబ్రవరి 20:** అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వ్యతిరేకంగా గతంలో లౌకికవాదులు, మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేసేవి. 'గుడికి డబ్బులు వృథా, బడులు--ఆసుపత్రులు కట్టాలి' అని ప్రచారం చేశాయి. కానీ, మోదీ రామ మందిర సమస్యకు పరిష్కారం చూపడంతోపాటు ఆలయం వృథా అన్న నోళ్లతోనే ఇప్పుడు శెభాష అనిపిస్తున్నారు. 2024 జనవరిలో ఆలయం పునఃప్రారంభించిన తర్వాత అయోధ్య ఆర్థిక పరిస్థితి మొత్తం మారిపోయింది. ఐఐఎం లక్నో 'ఎకనామిక్ రెనాసెన్స్ ఆఫ్ అయోధ్య' కేస్ స్టడీ రామ్ మందిర్ ప్రాంతీయ అభివృద్ధిని స్పష్టంగా ధ్రువీకరించిందిరామ మందిరం నిర్మానానికి ముందు అయోధ్యకు ఏటా 1.7 లక్షల మంది సందర్శకులు వచ్చేవారు. 2024 మొదటి ఆరు నెలల్లోనే 11 కోట్ల మంది అయోధ్యను సందర్శించారు. 2025 కుంభమేళాతో రికార్డు స్థాయిలు. 2025--26కు టూరిజం ఆదాయం రూ.10,000 కోట్లకు చేరనుంది. చుట్టుపక్కల తీర్థక్షేత్రాల సందర్శనలు కూడా పెరిగాయి. చిన్నచిన్న దుకాణాదారులకు ఇదివరకు రోజుకు రూ.500 ఆదాయం రాగా, ఇప్పుడు రూ.2,500 వస్తోంది. ఇక రియల్ ఎస్టేట్ విషయానికి వస్తే.. అమాంతం పెరిగింది. అయోధ్య పట్టణం నుంచి కేంద్రానికి రూ.400 కోట్ల జీఎస్టీ వస్తోంది. టూరిజం పరంగా చూస్తే 2025--26 కు సంబంధించిన అంచనా ప్రకారం.. రూ.10 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. హోటల్ రూంల విషయానికి వస్తే 2024 వరకు 2 వేల హోటళ్లు ఉండగా, ఇప్పుడు 5 వేలకు పెరిగాయి. రెస్టారెంట్లు గతంలో 200 ఉండగా, ఇప్పుడు 2 వేలకు పెరిగాయి. పేదవాడికి సంబంధించిన రిక్షాల సంఖ్య గతంలో 500లు ఉండగా, ఇప్పుడు 17 వేలకు పెరిగింది, వస్త్ర దుకాణాలు గతంలో 150 ఉండగా ఇప్పుడు 500 లకు పెరిగాయి. హోం స్టేలు, ఇళ్లలో పేయింగ్ గెస్ట్‌గా ఉండే హోం స్టేల సంఖ్య 1136కు పెరిగింది. గతంలో ఒక్కటి కూడా ఉండేది కాదు.'గుడి వృథా' వాదనలు తప్పుగా ఉన్నాయి. మందిరం టూరిజం ద్వారా బడులు, ఆసుపత్రుల నిధులు సొంతంగా వస్తున్నాయి. స్థానికుల ఆదాయం 5 రెట్లు పెరిగింది. ఇది సాంస్కృతిక విశ్వాసాలు ఆర్థిక ప్రగతికి దారి తీస్తాయని నిరూపిస్తోంది.

# ఉచిత పథకాలు
# దేశ ఆర్థికాభివృద్ధికి దెబ్బ

**సుప్రీంకోర్టు**

**హైదరాబాద్:** దేశంలో పెరుగుతున్న ఉచిత పథకాల సంస్కృతిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని వ్యాఖ్యనించింది.రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది.బి



**ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్:**

ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్– 2024లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్నవారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సీజేఐ ప్రశ్నించారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉండి కూడా డబ్బు పంపిణీ చేయడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధులను సాగునీరు, విద్యుత్ వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు ఎందుకు కేటాయించకూడదని అడిగారు. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ నగదు బదిలీ, విధానాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు గౌరవంగా బతకడానికి మీరు ఉపాధి మార్గాలను సృష్టించాలి. ఉదయం లేచినప్పటి నుంచి ఉచిత ఆహారం, గ్యాస్, విద్యుత్ ఇస్తూ నేరుగా ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంటే, ప్రజలు ఎందుకు పని చేస్తారు? ప్రతిదీ ఉచితంగా దొరుకుతున్నప్పుడు ప్రజలు ఏం పని చేస్తారు. మనం చేస్తున్నది దేశ నిర్మాణమేనా అని సీజేఐ ప్రశ్నించారు.

## 800 రోజులు పూర్తయినా..
# అమలు కాని ఆరు గ్యారెంటీలు

- మొదటి పేజీ తరువాయి

మాయమాటలు చెప్పారు. ఏటా రూ. 15,000 రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్ను కేసీఆర్ రూ. 2,000 చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు తాము డిసెంబర్లో గెలిచిన మరుసటి నెల నుంచే రూ. 4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. 27 నెలలు గడుస్తున్నా ఆ 4000 పెన్షన్ రాలేదు.ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత మరియు చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4,000 పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారిని డిమాండ్ చేస్తున్నాను. మహిళలందరికీ నెలకు రూ. 2,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పటిదాకా ఒక్క మహిళకు కూడా ఆ డబ్బులు ఇవ్వలేదు. తక్షణమే ఈ బడ్జెట్లో మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చేలా నిధులు కేటాయించాలని అన్నారు.గత బడ్జెట్లో అసెంబ్లీలో గొప్పగా స్పీచులు దంచి, బల్లలు చరిచి చెప్పిన పథకాలు ఏవీ అమలు కాలేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇప్పటికీ కూలీలకు డబ్బులు అందలేదు, పంటల బీమా రాలేదు. యువత కోసం ప్రవేశపెడతామన్న రాజీవ్ యువ వికాసం అమలు కాలేదు. ఏ ఒక్క యువతీయువకుడికి ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు. బడ్జెట్లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారు. కనీసం ఈ బడ్జెట్లైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలి. రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా ఈ బడ్జెట్లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నానని అన్నారు.



# మళ్లీ తెరపైకి సెంటిమెంట్

- మొదటి పేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికల్లో 'తెలంగాణ ఆత్మగౌరవం' అనే అంశం బీఆర్ఎస్‌కు శ్రీరామరక్షగా నిలిచింది. అయితే, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ 'మార్పు' నినాదంతో అధికారంలోకి రావడంతో, బీఆర్ఎస్ తన పట్టును కోల్పోయింది. అయితే అసెంబ్లీ ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా, చివరకు స్థానిక సంస్థల ఎన్నికలైనా కేసీఆర్ మళ్ళీ "తెలంగాణకు అన్యాయం జరుగుతోంది" లేదా "ఆంధ్ర పెత్తనం పెరుగుతోంది" అనే భావజాలాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని కడియం శ్రీహరి తప్పుబడుతున్నారువరుస ఓటములతో నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులను ఏకం చేయడానికి బీఆర్ఎస్ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోంది. తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి పక్కదారి మళ్ళించే వ్యూహం కూడా ఇందులో దాగి ఉంది. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపే క్రమంలో సెంటిమెంట్‌ను జోడించి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా లబ్ది పొందాలనేది వ్యూహంగా కనిపిస్తోంది. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా 'ప్రాంతీయ పార్టీయే రక్షణ' అనే భావనను బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశం.కడియం శ్రీహరి ఒకప్పుడు బీఆర్ఎస్‌లో కీలక నేతగా, ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఒక బలమైన ఆయుధంగా మారాయి. కడియం వంటి సీనియర్ దళిత నాయకుడు కేసీఆర్‌ను వ్యతిరేకించడం వల్ల, గతంలో బీఆర్ఎస్ వైపు ఉన్న సామాజిక వర్గాల్లో పునరాలోచన మొదలయ్యే అవకాశం ఉంది. కేసీఆర్ మాటలకు మునుపటి పదును లేదని, ఆయన మాటల్లో నిజాయితీ లేదని ప్రజలకు వివరించడంలో కడియం సఫలమవుతున్నారు.తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్ అనేది ఎప్పుడూ ఒక పదునైన కత్తి లాంటిది. అయితే, అభివృద్ధి, నిరుద్యోగం, సంక్షేమం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వస్తున్న ప్రస్తుత తరుణంలో, కేవలం సెంటిమెంట్‌తోనే గట్టెక్కడం బీఆర్ఎస్‌కు సవాలుతో కూడుకున్న పని. కడియం శ్రీహరి చేసిన ఘాటు విమర్శలు, కేసీఆర్ భవిష్యత్తు రాజకీయ వ్యూహాలను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో చూడాలి. ప్రజలు ఇప్పుడు 'భావోద్వేగాల' కంటే 'ఫలితాల'కే ప్రాధాన్యత ఇస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# అజారుద్దీన్ కు పదవీ గండం

- మొదటి పేజీ తరువాయి

అన్నట్లుగా వ్యూహాలకు పదును పెడుతున్నారట. ఈ దెబ్బతో ఇటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ, త్వరలో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాల భర్తీకి మార్గం సుగమమం కానున్నట్లు తెలుస్తోంది.అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఏడాది ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే ఇంతలోపే అజారుద్దీన్ మంత్రిగా పదవి చేపట్టి ఆరు నెలుల పూర్తి అయ్యే పరిస్థితి వస్తుంది. దీంతో కొత్త ఫార్ములాకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్.వచ్చే ఏప్రిల్ 30 నాటికి అజారుద్దీన్ ఎమ్మెల్సీగానో లేదా ఎమ్మెల్యేగానో ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంటుంది. అలా చేయకుంటే మంత్రి పదవికి గండం తప్పదు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా శాసనసభకు ఎలాంటి ఎన్నికలు లేకపోవడంతో ఇక ఎమ్మెల్సీగానే ఎన్నిక కావాల్సి ఉంది. అయితే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్లో ఉంది. ప్రొ.కోదండరామ్, అజారుద్దీన్ను ఎమ్మెల్సీగా నియమించాలని క్యాబినెట్ నిర్ణయించినా సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో సస్పెన్స్ కొనసాగుతోంది. అజారుద్దీన్ను పదవీగండం నుంచి గట్టెక్కించేందుకు..రేవంత్ వ్యూహాన్ని రచిస్తున్నారట. ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్నవారిలో ఒకరి చేత రాజీనామా చేయించి వారి స్థానంలో అజారుద్దీన్ను మండలికి పంపించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్సీగా రాజీనామా చేయబోయే నేతకు రాజ్యసభ సీటును ఆఫర్ చేసే అవకాశం ఉందట. అయితే అజారుద్దీన్ కోసం ఎమ్మెల్సీ సీటుకు రాజీనామా చేసే నేత ఎవరో.? రాజ్యసభకు వెళ్లేదెవరో.? వేచి చూడాలి.



## 'ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం..
## హైదరాబాద్ అనువైన ప్రదేశం

- మొదటి పేజీ తరువాయి

కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు.



**భారత్ అలాంటి తప్పిదం చేయొద్దు..**

ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు.

**హైదరాబాద్‌లో ఏఐ వార్ రూమ్..**

ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్–స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ – ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

**జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలి..**

స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశం చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.

**భారత్ నాయకత్వం వహించాలి..**

సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కవిత పార్టీ టీపీజేపీ?

- మొదటి పేజీ తరువాయి

చేసినట్లుగా సమాచారం. తన పార్టీ పేరులో తెలంగాణ ఉంటుందని చెప్పిన కవిత.. అన్నట్లుగానే ఇప్పుడున్న తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చేస్తూ తెలంగాణ ప్రజా జాగృతి పార్టీగా నిర్ణయించారని తెలుస్తోంది. కార్మిక దినోత్సవం రోజైన మే 1న పార్టీ ఆవిర్భావ ప్రకటన చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇక పసుపు, ఎరుపు రంగుల్లో పార్టీ జెండాను రూపొందిస్తున్నట్లు సమాచారం. గతంలో టీడీపీ వెంట బీసీ ఓటు బ్యాంక్ ఉండేది. ఆ ఓటు బ్యాంక్ ను తనవైపు తిప్పుకునేలా పసుపు టచ్ ఇస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో నడుస్తున్న చర్చ.ఇక పార్టీ గుర్తుగా కాగడా లేదా కళ్లజోడు గుర్తుపై కవిత ఫోకస్ చేశారు. వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట, బోధన్.. ఈ రెండు చోట్ల నుంచి కవిత బరిలోకి దిగుతారనే టాక్ వినిపిస్తోంది.ఆర్టీసి కార్మికుల సమ్మె విషయంలో బీఆర్ఎస్ పట్టించుకోలేదనే కోపం కార్మికుల్లో ఉంది. బిల్లుల చెల్లింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నయం. రెండేళ్లలో ఆర్టీసీలో సింగిల్ పర్మినెంట్ రిక్రూట్మెంట్ లేదని కవిత అన్నారు. ఫ్యూచర్‌లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఉండదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. ప్రధాన ప్రతిపక్షం మేమే అవుతాం.. చూస్తూ ఉండండి అంటూ కవిత అన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి మేమే వస్తామని, ప్రయారిటీల ఆధారంగా మేము సమస్యలపై పోరాటం చేస్తున్నామని కవిత చెప్పుకొచ్చారు.ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని కవిత స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు మున్సిపాలిటీల్లో గెలిచిన తరువాత వాళ్లకు ఫోన్లు చేసి ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ దారిలోనే వెళ్తుంది. కొత్త తరహా రాజకీయం కాంగ్రెస్ చేయడం లేదని కవిత అన్నారు.నేను పెట్టబోయే పార్టీ వ్యక్తుల మీద నడవదు.. వ్యవస్థల మీద నడవాలి. ప్రాంతీయ పార్టీ లీడర్ సెంట్రిక్ ఉంటుంది. కానీ, వ్యవస్థ నిర్మాణం జరగాలి. సైద్ధాంతిక పునాది ఉండాలని.. ఆ మేరకు పార్టీ నిర్మాణం ఉంటుందని కవిత చెప్పారు.ఆడవాళ్లు అని అవమానించొద్దు. షర్మిల ఈరోజు ఏపీలో ఒక జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడం ఇక్కడ ప్రజలకు నచ్చలేదు. చిరంజీవి పార్టీ పెట్టి మూసివేయలేదా..? నా లైన్లో నేను వెళ్తున్నా.. నా ప్రయత్నం నాది. తెలంగాణ వాదమే మా పార్టీ మొదటి లైన్ అని కవిత స్పష్టం చేశారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్లు కేంద్ర మంత్రులు అయ్యారు. కొత్త తరానికి పెట్టబోయే పార్టీలో అవకాశం ఉంటుందని కవిత చెప్పారు

## అదిలాబాద్ కు
# కొత్త ఎయిర్ పోర్టు

- మొదటి పేజీ తరువాయి

ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి. దశాబ్దాలుగా ఈ ప్రాంతం ప్రజలు ఎయిర్ కనెక్టివిటీ కోసం ఎదురు చూస్తున్నారు. నేడు ఆ కల సాకారం కాబోతుంది. ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్ ప్లాన్‌ను ముందుకు తీసుకెళ్లాలనే ఆకాంక్ష నేడు కార్యరూపం దాల్చుతోంది. అధికారికంగా మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. త్వరలోనే ఎయిర్‌పోర్టు నిర్మాణం పనులు ప్రారంభమవుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో ముందడుగు వేస్తోంది. మౌళిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వాటి ఫలితమే ఈ ముందడుగు.స్థానిక ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను నిజం చేయటం కోసం నిరంతర కృషి చేసిన కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్‌లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ విమానాశ్రయం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కంటే ఎక్కువ. ఇది ఆదిలాబాద్ జిల్లాకు ఒక మలుపు. మా జిల్లాను ప్రధాన నగరాలకు అనుసంధానిస్తుంది, స్థానిక వ్యాపారాలు, రైతులకు మద్దతు ఇస్తుంది, మా గిరిజన, అటవీ ప్రాంతాలకు పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, కొత్త పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఆదిలాబాద్ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది.' అని గోడం నగేష్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

## రాజ్యసభలో తెలంగాణ బిల్లు పాసై 12 ఏళ్లు..

- మొదటి పేజీ తరువాయి

సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్ రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

వార్తాతరంగాలు

శనివారం 21 ఫిబ్రవరి 2026

## నాంపల్లి సీబీఐ కోర్టుకు
# మరోసారి బాంబు బెదిరింపు..



హైదరాబాద్, ఫిబ్రవరి 20: నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. శుక్రవారం కోర్టు సిబ్బందికి ఈ మెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చింది. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లకు కోర్టు సిబ్బంది సమాచారం అందించారు. వారంతా కోర్టు వద్దకు చేరుకుని.. ప్రాంగణంలో న్యాయవాదులు, కక్షిదారులను ఆగమేఘాల మీద బయటకు పంపారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోంది. కోర్టులో బాంబు అమర్చామని.. దీనికి టైమ్ సైతం సెట్ చేశామని.. అది పేలబోతుందంటూ దుండగులు ఈ మెయిల్ ద్వారా సిబ్బందిని బెదిరించారు. దాంతో పోలీసులు కోర్టు ప్రాంగణంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. మరో వైపు ఫిబ్రవరి 18వ తేదీ తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడ ఎటువంటి బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. ఇవి నకిలీ బెదిరింపులుగా పోలీసులు నిర్ధారించారు. ఈ ఫోన్ కాల్స్, ఈ మెయిల్స్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఫోన్ కాల్స్, ఈ మెయిల్స్ ఎక్కడి నుంచి వచ్చాయినే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అంతలోనే కొన్ని గంటల వ్యవధిలోనే మళ్లీ బెదిరింపు ఫోన్ కాల్ రావడంపై కోర్టులో న్యాయవాదులు, కక్షిదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్ని ఆఫర్లు వచ్చినా జీవన్ రెడ్డి పార్టీలోనే ఉన్నారు..

**ఆయనకు అవమానం జరగకూడదు: జగ్గారెడ్డి**

**పరిస్థితులు అనుకూలించకపోవడంతో జీవన్ రెడ్డి ఓడిపోయారన్న జగ్గారెడ్డి**

**కాంగ్రెస్ కష్టకాలంలో ఆయన పార్టీలోనే ఉంటూ పని చేశారన్న జగ్గారెడ్డి**

**ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి**




జగిత్యాలలో సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డికి రాజకీయంగా ఎన్ని ఆఫర్లు వచ్చినా పార్టీలోనే కొనసాగారని, అలాంటి నాయకుడికి పార్టీలో అవమానం జరగకుండా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఎంపీగా, ఎమ్మెల్యేగా టిక్కెట్లు ఇచ్చి పార్టీ ఆయనను ప్రోత్సహించిందని, కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఆయన ఓడిపోయారని అన్నారు. కానీ ఆయన ఎప్పుడూ పార్టీ గీతను దాటలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులకు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతానని అన్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరగకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని అన్నారు. కాగా, తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ పదవీకాలం వచ్చే ఏప్రిల్ నెలలో ముగియనుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 16న తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరేందుకు జగ్గారెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీకి చెందిన మరో సీనియర్ నేత వి.హనుమంతరావు కూడా తనకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే అధిష్ఠానానికి లేఖ రాశారు.

# 15 ఏళ్ల సమయమిచ్చినా మీరేం చేయలేరు..

**నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా?: రాజాసింగ్**

**మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారన్న రాజాసింగ్**

**ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని సవాల్**

**ఒవైసీ సోదరులపై రాజాసింగ్ ఆగ్రహం**



మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు 15 నిమిషాలు అడిగారు, కానీ నాకు ఐదు నిమిషాల సమయం ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్ మాట్లాడుతూ, తమకు 15 నిమిషాల సమయం ఇస్తే హిందువులు లేకుండా చేస్తానని అన్నారని మండిపడ్డారు. 15 నిమిషాలు కాదు 15 గంటలు, 15 రోజులు, 15 నెలలు అవసరమైతే 15 సంవత్సరాలు ఇచ్చినా మీరేం చేయలేరని అన్నారు. మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారు మీరేం చేస్తారని మండిపడ్డారు. కానీ తమకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని అన్నారు. తాను ఎక్కడకు రావాలో చెప్పాలని అన్నారు. నీ ప్రాంతానికి రావాలా, నీ ఇంటికి రావాలా, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ ఏదీ వద్దని వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డికి స్వల్ప అస్వస్థత

**నిమ్స్ ఆసుపత్రికి తరలించిన కుటుంబ సభ్యులు**

**వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థత**

**ఫుడ్ పాయిజన్ అయినట్లు చెబుతున్న కుటుంబ సభ్యులు**



మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వాంతులు, విరేచనాల కారణంగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఆయనకు ఫుడ్ పాయిజన్ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నిమ్స్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. కాగా, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అంశంలో జీవన్ రెడ్డి పార్టీ రాష్ట్ర నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జగిత్యాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సంజయ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి ఉండటాన్ని జీవన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి 20 టిక్కెట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి 30 టిక్కెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఫలితాలు వెలువడిన తర్వాత సంజయ్ కుమార్ వర్గానికి ఛైర్మన్ పదవిని ఇవ్వడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

## పొలిటికల్ ఫైట్‌లో...
# నలిగిపోతున్న అమాత్యులు



కరీంనగర్, ఫిబ్రవరి 20: ఆ నియోజకవర్గ రాజకీయాలు ఓ మంత్రికి హెడెక్‌గా మారాయి. కనీసం మంత్రి పదవి దక్కిందన్న సంతోషాన్ని కూడా దూరం చేస్తున్నాయట. సీనియర్ నేతకు.. ఎమ్మెల్యేకు మధ్య జరుగుతున్న పొలిటికల్ ఫైట్‌లో అమాత్యుల వారు నలిగిపోతున్నారట. అధిష్టానం నిర్ణయాన్ని తప్పుపట్టలేక...గురువు గారి మాట జవదాటలేక ఆయన సఫర్ అవుతున్నారట. గురువు తరఫున వకాల్తా తీసుకోని అధిష్టానం దగ్గర వాదించలేకపోతున్నారట. ఇద్దరు నేతల మధ్య మంత్రి పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారిందనే చర్చ సాగుతుంది. ఇంతకు ఎవరా మంత్రి? ఆయనకొచ్చిన బాధేంటి వరుస ఓటముల తర్వాత ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యేగా గెలిచిన అడ్లూరి లక్ష్మణ్‌కు..రెండో విడత క్యాబినెట్ విస్తరణలో మంత్రి పదవి దక్కింది. ఇన్నేళ్ల తన కష్టానికి ఫలితం దక్కిందనుకుంటున్న సందర్భంలో..జగిత్యాల జగడం ఆయనకు హెడెక్‌గా మారిందట. సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్, తన గురువు అయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి మధ్య నడుస్తోన్న పొలిటికల్ వార్‌లో అడ్లూరి ఇబ్బంది పడాల్సి వస్తోందట. కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే సంజయ్‌కి సపోర్ట్‌గా నిలుస్తుండటంతో..జీవన్ రెడ్డికి పట్టలేనంత ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. జీవన్ రెడ్డిని కాదని..సంజయ్‌తో కలిసి నడవడాలంటే మంత్రి ఇబ్బంది పడుతున్నారట. తప్పని పరిస్థితుల్లో నడవాల్సి వస్తే...గురువు గారి గుస్సాకు గురి కావాల్సి వస్తుందట.జగిత్యాలలో అన్నీ తానై నడిపించిన కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి 2023లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్ కుమార్ హస్తం పార్టీతో దోస్తీ కట్టారు. దీంతో తమను నమ్ముకుని వచ్చారని సంజయ్‌కి హస్తం పార్టీ పెద్దలు ప్రయారిటీ ఇస్తున్నారట. ఇది జీవన్‌రెడ్డికి ఏ మాత్రం నచ్చట్లేదట. ఎప్పటికప్పుడు మంత్రులు, సమీక్షలు..వేదిక ఏదైనా తన నిరసనను వ్యక్తం చేస్తున్నా..అధిష్టానం మాత్రం జీవన్ రెడ్డిని పట్టించుకోవడం లేదనే టాక్ వినిపిస్తోంది. జగిత్యాల జిల్లా మంత్రిగా వ్యవహరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్ ఇద్దరి మధ్య నలిగిపోతున్నారట. జగిత్యాల జగడంలో ఇన్వాల్వ్ కావాలంటేనే జంకుతున్నారట. ఒక్క అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాత్రమే కాదు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా జగిత్యాలకు రాకుండానే తిరుగు ప్రయాణమవుతున్నారు. సీనియర్ నేతలే జీవన్ రెడ్డిని ఫేస్ చేయడానికి వెనకాముందు ఆడుతున్నారంటే...ఇక అడ్లూరి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. జగిత్యాలలో జరిగే అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాలంటే అడ్లూరి ఆలోచిస్తున్నారట. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ప్రకారం లోకల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొనాలి. లేకపోతే ప్రోటోకాల్ ఉల్లంఘన కింద విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సంజయ్ కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి సపోర్ట్ ఉందనే కారణంతో ..మంత్రి కూడా సైలెంట్‌గా తన పని తాను చేసుకుంటున్నారట. ఇదే సందర్భంలో జీవన్ రెడ్డికి మద్దతుగా నిలిచి అధిష్టానాన్ని తప్పుపట్టలేని పరిస్థితిలో ఉన్నారట. అధిష్టానాన్ని ఎదిరించడం నాతో సాధ్యమేనా అంటూ గురువు జీవన్ రెడ్డికి సమాధానమిస్తున్నారట. అయినా సరే పార్టీ నిర్ణయాన్ని తప్పుపడుతున్న సందర్భంలో మంత్రి అడ్లూరిపై కూడా జీవన్ రెడ్డి ఓపెన్‌గానే ఫైర్ అవుతూనే ఉన్నారు.ఎదురు సమాధానం చెప్పలేక మౌనంగా మిన్నకుండి పోతున్నారట మంత్రిగారు. అధిష్టానం గీసిన లక్ష్మణ రేఖ దాటకుండా..తన గురువుకు న్యాయం చేయాలంటున్నారట. జీవన్‌రెడ్డికి ఏదో ఒక ప్రోటోకాల్ పదవి ఇవ్వాలంటూ అధిష్టానం దగ్గర పట్టుపడుతున్నారట అడ్లూరి. ఇటీవల జీవన్ రెడ్డి విమర్శల దాడి పెంచుతుండటంతో పాటు..ఆయన ఆగ్రహాన్ని చల్లార్చేందుకు తెరవెనుక ప్రయత్నాల్లో బిజీ అయిపోయారట మంత్రిగారు.ఏదైనా గురువు కోసం జీవన్‌రెడ్డి పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదంటూ రాజకీయ వర్గాల్లో చర్చ జరగడం ఆసక్తికరంగా మారింది. జీవన్ రెడ్డి ఇష్యూ సాల్వ్ అయితేనే అడ్లూరి కళ్లల్లో మంత్రి దక్కిందన్న ఆనందం కనిపించే అవకాశం ఉందంటున్నారు. లేకపోతే మిగితా మంత్రుల బాటలో ఆయన కూడా జీవన్‌రెడ్డి కనిపిస్తే చాలు సైడ్ పోవాల్సిందే అంటున్నారు.

# హైదరాబాద్‌లో హాట్ కేకుల్లా ప్లాట్లు..

**14 ప్లాట్ల వేలంతో రూ.14.75 కోట్ల ఆదాయం**



హైదరాబాద్, ఫిబ్రవరి 20: హైదరాబాద్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లకు నిర్వహించిన వేలంలో భారీ ధర పలికాయి. 14 ప్లాట్లను వేలం వేయగా.. ఏకంగా రూ.14.75 కోట్ల ఆదాయం సమకూరింది. చదరపు గజానికి కనీస ధర రూ.32 వేలు నిర్వహించగా.. గరిష్ఠంగా రూ.51 వేలకు విక్రయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక మరో విడత వేలం ఈనెల 23న నిర్వహించనున్నారు.శరవేగంగా డెవలప్ అవుతున్న హైదరాబాద్ మహా నగరంలో ఖాళీ ప్లాట్లు దొరకడమే గగనం అయిపోయింది. ప్లాట్లు కొనాలంటే నగర శివార్లకు వెళ్లాల్సిందే. అది కూడా భారీగా ధరలు పెట్టాల్సిందే. ఇక నగరం నడిబొడ్డున ప్లాట్లు కొనాలంటే కోట్ల రూపాయలు కుమ్మరించాల్సిందే. ఇక అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో స్థలాలు అత్యధిక పలికి రికార్డుల్లోకి ఎక్కిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు పరిధిలో ఉన్న ఖాళీ ప్లాట్లకు నోటిఫికేషన్ విడుదల చేసి.. తాజాగా వేలం నిర్వహించగా.. కళ్లు చెదిరే ఆదాయం వచ్చింది.హైదరాబాద్ నగర శివారు అయిన రాజేంద్ర నగర్ మండలంలో ఓపెన్ ప్లాట్లకు వేలం నిర్వహించారు. లక్ష్మీగూడలోని హౌసింగ్ బోర్డు ప్లాట్లను అమ్మకానికి పెట్టగా.. భారీ ఎత్తున స్పందన వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. అక్కడ ఉన్న 14 ప్లాట్లను తాజాగా బహిరంగ వేలం జరిపారు. ఈ ప్లాట్ల విక్రయించడానికి సంబంధించి ఈనెల 2వ తేదీన హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.బహిరంగ వేలం పాట నిర్వహించగా.. అందులో 49 మంది కొనుగోలుదారులు హాజరయ్యారు. మొదట ఈ భూములకు చదరపు గజానికి రూ.32 వేలను కనీస ధరగా హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఇక వేలంలో అనూహ్యంగా చదరపు గజం ధర గరిష్టంగా రూ.51 వేలు పలికి అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలోనే ఏకంగా 14 ప్లాట్ల హాట్ కేకుల్లా విక్రయం అయ్యాయి.ఈ ప్లాట్లను అమ్మడం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ.14.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ వెల్లడించారు. హౌసింగ్ బోర్డు సౌత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ఈ బహిరంగ వేలాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక ఈ వేలంలో అతి తక్కువగా చదరపు గజానికి రూ.36 వేల ధర పలికింది. దీంతో సగటున ఒక్కో చదరపు గజం రూ.44,285కు విక్రయం అయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.మరోవైపు.. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను వేలం వేయడానికి హౌసింగ్ బోర్డు ఇటీవలె నోటిఫికేషన్ విడుదల చేసింది. గచ్చిబౌలి, లింగంపల్లి, కూకట్‌పల్లి, చింతల్, కుత్బుల్లాపూర్, నిజాంపేట ప్రాంతాల్లో ఈ ప్లాట్లు ఉన్నట్లు వెల్లడించింది. భరత్ నగర్ మెట్రో స్టేషన్ వద్ద 1106 గజాలు.. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో 266 గజాలు.. బౌరంపేటలో 2,600 గజాలు, చింతల్ హౌసింగ్ బోర్డు కాలనీలో 6 ప్లాట్లు.. గచ్చిబౌలి హౌసింగ్ బోర్డు కాలనీలో 3 ప్లాట్లు, నిజాంపేటలో ఒక ప్లాటు ఉందని తెలిపారు. ఈ స్థలాలకు ఈనెల 23వ తేదీన వేలం నిర్వహించనున్నట్టు వీపీ గౌతమ్ తెలిపారు. వేలం రోజు ఉదయం నాటికి డీడీ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ మెరుపు ధర్నా...

**బీసీ సబ్ ప్లాన్ తక్షణ అమలు చేయాలని డిమాండ్**

**బడ్జెట్లో బీసీలకు 55వేల కోట్లు కేటాయించాలి..**

**కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి...**

**బీసీలకు 42% శాతం విద్యా,ఉపాధి, ఉద్యోగ,కాంట్రాక్టుల్లో కల్పించాలి..**

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్.**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని +బఆ ్రఖితీఎ వద్ద మెరుపు ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేసి, బీసీలకు కేటాయించాల్సిన నిధులను పూర్తిగా విడుదల చేసి, ఆ నిధులను బీసీ వర్గాల అభివృద్ధికే ఖర్చు చేయాలని పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గాలు జనాభాలో అధిక శాతం ఉన్నప్పటికీ, వారికి తగిన న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేసి బీసీలకు రావాల్సిన 55వేల కోట్లు ఈ బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు... విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, గృహ నిర్మాణం, వృత్తి అభివృద్ధి వంటి రంగాల్లో బీసీలకు 42 శాతం అమలు చేయాలని అలా జరిగినప్పుడే బీసీలకు నిజమైన లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు గుప్పిస్తూ...ప్రతి ఏడాది బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ నిధులు పూర్తిగా ఖర్చు కావడం లేదని, ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. ఇది బీసీ వర్గాల పట్ల అన్యాయం మాత్రమే కాకుండా, వారి హక్కుల ఉల్లంఘన అని అన్నారు. ఈ మెరుపు ధర్నాలో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,విద్యార్థి సంఘం నాయకులు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని తమ ఐక్యతను చాటారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు..ఈ కార్యక్రమానికి బీసీ సంఘాలు కూడా మద్దతునిస్తూ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు..

**తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్పష్టం**

బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలి...55 వేల కోట్లు బీసీలకు బడ్జెట్లో కేటాయించాలి బీసీలకు కేటాయించిన నిధులను వేరే అవసరాలకు మళ్లించకుండా, వారి అభివృద్ధికే ఖర్చు చేయాలి... బీసీలకు 42% శాతం విద్య,ఉద్యోగ,కాంట్రాక్టుల్లో కేటాయించాలి బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని పార్టీ హెచ్చరించింది.

# డబ్బా కొట్టుకోవడానికి ఏముంది..?

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి**



హైదరాబాద్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు సంధించారు. ఇటీవల ముగిసిన మునిసిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ అధికార పార్టీకే అనుకూలంగా ఉంటాయని అన్నారు. పనులు కావాలి కాబట్టి సర్పంచ్, మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అత్యధిక శాతం అధికార పార్టీకే ప్రజలు ఓటు వేస్తారు. ఇందులో డబ్బా కొట్టుకోవడానికి ఏముందని ప్రశ్నించారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తాం

కమాన్ పూర్ : జూలపల్లి ములకలపల్లి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని గ్రామ సర్పంచ్ పోల్దాసరి వనిత సాయికుమార్, ఉప సర్పంచ్ గడ్డం రాజమహేందర్ లు పేర్కొన్నారు. శుక్రవారం కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ములకలపల్లి గ్రామ రహదారికి ఇరుపక్కల పిచ్చి మొక్కలు మరియు పొదలు పెరగడంతో గ్రామస్తుల సూచన మేరకు ముళ్ళ పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో శుక్రవారం గ్రామంలోకి వెళ్లే రహదారి పూర్తిగా వదలను తొలగించి ప్రజలకు సౌకర్యంగా మార్చారు. దీంతో ములకలపల్లి వాసులు గ్రామ సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయి కుమార్ కు ఉప సర్పంచ్ గడ్డం రాజమహేంద్ర కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇన్చార్జి కార్యదర్శి ఆమీనా భాను, వార్డు సభ్యులు పులి లక్ష్మణ్, తాళ్లపల్లి శ్రీనివాస్ బొల్లంపల్లి కుమార్ పులి కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
శనివారం 21 ఫిబ్రవరి 2026

# షాద్ నగర్ గడ్డ కాంగ్రెస్ అడ్డా

**నెరవేరిన కాంగ్రెస్ కల**

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 20 :-** రంగారెడ్డి షాద్నగర్ పట్టణం మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుకున్న కల నెరవేరింది చేజారిన పీఠాన్ని తిరిగి దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది షాద్ నగర్ మున్సిపల్ గడ్డ కాంగ్రెస్ అడ్డాగా మార్చేసింది ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, పార్టీ ముఖ్య వర్గాలు కష్టపడి పనిచేసి సమిష్టి విజయాన్ని సాధించి విజయతీరాలకు చేర్చారు మంచి శుభ ముహూర్తాన కాంగ్రెస్ మున్సిపల్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది అంగరంగ వైభవంగా జరిగిన వేడుకకు పుర ప్రముఖులు మీడియా ప్రతినిధులు నాయకులు అభిమానులు భారీ ఎత్తున హాజరయ్యారు గత ఎన్నికల్లో గులాబీ పీఠాన్ని కిందికి దించి కాంగ్రెస్ పీఠాన్ని చేజిక్కించుకొని పూర్వ వైభవాన్ని సంతరించేలా చేసిన కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికపై పార్టీ క్యాడర్ సంతోషం వ్యక్తం చేస్తుంది గెలుపు కావలసిన అవకాశాన్నింటిని చేతపట్టుకుని ఎవరిని చేయి చాచే కర్మ పట్టకుండా పీఠాన్ని దక్కించుకున్న తీరు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవబోతోంది కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో 28 స్థానాలకు 15 స్థానాలను దక్కించుకొని ఎమ్మెల్యే శంకర్ ఎక్స్ అఫిషియో ద్వారా మొత్తం 16 ఓట్లతో పీఠాన్ని చేజిక్కించుకుంది ఇక బిఆర్ఎస్ పార్టీని మ్యాజిక్ ఫిగర్ దడకుండా 11 సీట్లకే కట్టడి చేసింది అప్రతిహతంగా జైత్రయాత్ర సాగించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంది కార్యకర్తలకు సంబంధించిన ఎన్నికల్లో కార్యకర్తలను ప్రజా ప్రతినిధులను చేసే బాధ్యత బుజస్కందాలపై వేసుకున్న కాంగ్రెస్ నాయకులు సమిష్టిగా విజయాన్ని సొంతం చేసుకున్నారు.

## శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసాలు, అన్నప్రాస,లలితా సహస్ర పారాయణ పఠనం...



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 20( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన చిన్నారులకు అక్షరాభ్యాసాలు అన్నప్రాసకార్యక్రమాలు అమ్మవారి సన్నిధిలో ఆలయ ప్రధాన అర్చకులు పి.నవీన్ కుమార్ నిర్వహించారు.శ్రీజ్ఞాన సరస్వతి లలిత సహస్ర పారాయణ కమిటీ మహిళా సభ్యులచే లలితా సహస్ర పారాయణ పఠనం,మణిద్వీప వర్ణన,లింగాష్టకం భక్తి శ్రద్ధలతో పారాయణం,కుంకుమార్చన చేశారు.భక్తులకు వేదఆశీర్వచనం,తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.అనంతరం ఆలయంలోని నిత్య అన్నప్రసాద శాలలో సామూహిక అన్న ప్రసాద పంపిణీ చేశారు.భక్తులు అక్షరాభ్యాసాలు,అన్నప్రాస,వివిధ పూజాలకు వివరాలకు 9441303182 లో సంప్రదించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అల్లంపల్లి శివకుమార్,జె.నవీన్ కుమార్,భూపాల్ రెడ్డి,భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించుకోవడం గర్వం గా ఉంది

**మంత్రి వాకిటి శ్రీహరి**



**నారాయణపేట ఫిబ్రవరి 20:( స్కైన్యూస్)** రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలు మక్తల్ లో నిర్వహించుకోవడం గర్వంగా ఉందని రాష్ట్ర క్రీడలు యువజన, మత్స్య ,పాడి పరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ లో సీఎం కప్ సెకండ్ ఎడిషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారం భం అయ్యాయి. రాష్ట్ర మం త్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథి గా హాజరై జ్యోతి వెలి గించి ఈ పోటీలను ప్రారంభిం చారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి వచ్చిన 60 జట్లు ఈ పోటీల్లో తలపడ నున్నాయి. గ్రౌండ్ లో మంత్రి క్రీడాకారులతో కబడ్డీ ఆడి లాంచనంగా ప్రారంభించారు

**ప్రారంభ సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ...**

మక్తల్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నం దుకు సీఎం కు ధన్యవాదాలు తెలిపారు.నేను చిన్న తనం లో ఇక్కడే ఈ మట్టి లో ఆడే వాళ్ళమనీ.ఈ మట్టిలో ఆడిన వ్యక్తి గా ఇక్కడ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించు కోవడం గర్వంగా ఉందన్నా రు.మక్తల్ లో 25 కోట్ల తో స్టేడియం ను త్వరలో ఏర్పాటు చేయబోతున్నామనీ చెప్పారు.రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు ఆటలో నైపు ణ్యం ప్రదర్శించాలనీ జాతీయ స్థాయికి ఎదగాలన్నారు.జాతీయ స్థాయిలో ఆడితే క్రీడాకారులకు సంబంధించిన ఖర్చు అంతా ప్రభుత్వమే భరిస్తుందనీ తెలిపారు.గ్రామీణ స్థాయి క్రీడా కారుల ను వెలికితేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చిందన్నారు.బడ్జెట్ లో ఈ సారి స్పోర్ట్స్ కు అధిక నిధులు కేటాయించబో తున్నామని చెప్పారు.గ్లోబల్ సమ్మిట్ లో క్రీడా శాఖ కి 25 వేల కోట్ల రూపాయల పెట్టుబ డులు వచ్చాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకా అనే రులకు 3 కోట్ల రూపాయల పారితోషికం ఇస్తున్నామ న్నారు.కబడ్డీ క్రీడ మట్టి వాసన నుండి పుట్టిన క్రీడ అని పేర్కొన్నారు.క్రీడా కారుల కోసం గచ్చిబౌలి లో 25 కోట్ల తో హాస్పిటల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ వినీత్ రాజ్, ,మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, వైస్ చైర్ పర్సన్ శైవీ రెడ్డి, మక్తల్ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ రాధా లక్ష్మా రెడ్డి,జిల్లా స్పోర్ట్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా పై సి ఎం ప్రకటన చేయాలి

**సామాజిక కార్యకర్త నర్సింహ**



**నారాయణపేట ఫిబ్రవరి 20: (స్కైన్యూస్):**తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి లేదా సంబంధిత మంత్రులు యాసంగి రైతు భరోసా ఇస్తారా లేదా స్పష్టం చేయాలని సామాజిక కార్య కర్త హెచ్.నర్సింహ ఒక ప్రకట నలో కోరారు.మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వా త కూడా ప్రభుత్వం రైతు భరో సా ఇవ్వకుండా కాలయాపన చేయడం చూస్తూ ఉంటే ఈ సారి కూడా యాసంగి సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టేటట్లు ఉంది అన్న అనుమానం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్ ప్రారంభం అయి రెండు నెలలు పూర్తి అయిన కూడా రైతు భరోసా డబ్బులు ఇవ్వ నందుకు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ద్వారా డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెడుతు న్నారని తెలిపారు.ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఖరీఫ్, యాసంగి తో సంబంధం లేకుండా పంటలు సాగు చేసే భూములకు సంవత్సరానికి 12 వేల రైతు భరోసాను సరి అయిన సమయంలో రైతుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

# సదరం క్యాంపును పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన





**కొత్తగూడెం ఫిబ్రవరి 20 (స్కై న్యూస్ ):** ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ సదరం క్యాంపును శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపులో నిర్వహిస్తున్న దివ్యాంగుల వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల లభ్యత, వైకల్యం నిర్ధారణకు వినియోగిస్తున్న పరికరాల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రతి దివ్యాంగుడికి అవసరమైన గుర్తింపు సర్టిఫికేషన్ అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ యు డి ఐ డి కార్డులు తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతాయని తెలిపారు . ఈ కార్డుల ద్వారా దివ్యాంగులు ఆరోగ్య, విద్య, ఉపాధి, రవాణా తదితర రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందగలరని తెలిపారు. ప్రతి దివ్యాంగుడు సమాజంలో సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కొత్తగా యూడీఐడీ కార్డుల కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులకు ఆసుపత్రిలో వైకల్యం నిర్ధారణ కోసం సదరం స్లాట్ బుకింగ్ చేయాలని, ముందస్తుగా దరఖాస్తుదారులకు సమాచారం అందించి సమయానికి పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. వైద్య పరీక్షల సమయంలో అవసరమైన వైద్య నిపుణులు, పరీక్షా పరికరాలు సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సదరం క్యాంపు ప్రాంతంలో దివ్యాంగులు ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చెయిర్లు వంటి ప్రాథమిక వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని అన్నారు.పరీక్షల అనంతరం ప్రతి దివ్యాంగుడి వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల సర్టిఫికేషన్ వివరాలను సమగ్రంగా యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేసి, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమాచారం డిజిటల్ రూపంలో భద్రపరచడం వల్ల భవిష్యత్తులో వివిధ పథకాల అమలుకు ఇది బలమైన ఆధారంగా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ పరిశీలనలో వైద్య నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంట ఎమ్మెల్యే సందడి

**ఆర్భాటంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం**

**ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ తదితర నేతలు**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 20 :-** రంగారెడ్డి జిల్లా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోనీ 17వ వార్డులో స్థానిక కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాషా ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని లబ్ధిదారులు మంజుల బాలరాజ్ దంపతులు అట్టహాసంగా చేపట్టారు గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు స్థానిక నాయకులతో కలిసి నెహ్రూ కాలనీలోని మంజుల బాలరాజ్ దంపతులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఇంటి యజమానులకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా చీరసారె పెట్టి అభినందించారు పట్టణంలో మొట్టమొదటి ఇందిరమ్మ గృహాన్ని మంజూరు చేసిన అనంతరం లబ్ధిదారులు ఇల్లు కట్టుకొని నేడు పండుగ చేసుకుంటున్నారు ఈ పండుగకు పెద్దమనిషిగా వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులను పిలవడంతో పూర్తిగా పండగ వాతావరణం నెలకొంది గతంలో సన్న బియ్యం పంపిణీ చేసినప్పుడు మంజుల గృహంలోని సన్న బియ్యం భోజనాలను ఎమ్మెల్యే చేశారు తిరిగి ఇప్పుడు గృహప్రవేశానికి వచ్చి లబ్ధిదారుల రుణం తీర్చుకున్నారు ఇలలో మనుషులకు గృహమే స్వర్గసీమ అని అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను నిరుపేదలకు అందజేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలను వంచిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత 10 ఏళ్లలో జరిగిన లోటుపాట్లను సవరించి ప్రజలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను కడతెర్చుతున్నామని అన్నారు నియోజకవర్గంలో పలు దఫాలుగా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా చేస్తానని హామీ ఇచ్చారు రాబోయే మూడేళ్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కటిస్తామని అన్నారు అదేవిధంగా పట్టణంలో మార్చి మొదటి వారంలో ఇందిరమ్మ గృహాలను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు పట్టణంలో ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని లబ్ధిదారులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, స్థానిక కౌన్సిలర్ నాజియా సర్వర్ పాషా, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేశం ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, పట్టణ సీనియర్ నాయకులు వావిలాల సుజీవన్, మాజీ ఎంపిటిసి తుపాకుల శేఖర్ తదితరులు హాజరయ్యారు.

## గద్వాల మున్సిపాలిటీ ఆదర్శవంతమైన మున్సిపాలిటీ గా తీర్చిదిద్దాం....



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 20(స్కై న్యూస్,):**గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ పదవి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే.గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మున్సిపాలిటీ నందు గద్వాల మున్సిపాలిటీ నూతనంగా మున్సిపల్ చైర్ పర్సన్ గా తుమ్మల జయలక్ష్మీ నర్సింహులు యాదవ్ నేడు పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే కి మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్స్ శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సమక్షంలో మున్సిపల్ చైర్ పర్సన్ గా తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్ మొదటి సంతకం చేసి పదవికి బాధ్యతలు స్వీకరించిన జరిగింది.మున్సిపల్ చైర్ పర్సన్ గారికి బ్రాహ్మణులు, ముస్లిం మత పెద్దలు, చర్చి పాస్టర్లు ఆశీర్వదించడం జరిగినది.నూతనంగా మున్సిపల్ చైర్ పర్సన్ బాధ్యతలు స్వీకరించిన చైర్పర్సన్ కి వైస్ చైర్మన్ కి గద్వాల ఎమ్మెల్యే శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే కి మున్సిపల్ చైర్ పర్సన్ గారు ప్రత్యేకమైన నెమలి దండ తో ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూగద్వాల మున్సిపల్ నూతన చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్స్ హార్థిక శు భాకాంక్షలు.గద్వాల పట్టణ ప్రజలు మీపై మీకు ఓట్లు వేసి కౌన్సిలర్ గా అవకాశం కల్పించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డ్ అభివృద్ధికి కృషి చేయాలి ప్రజలకు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేయాలని సూచించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి , జిల్లా మంత్రివర్యులు రాష్ట్ర మంత్రివర్యులు సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గద్వాల మున్సిపాలిటీ భవిష్యత్తులో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు.భవిష్యత్తులో మున్సిపాలిటీ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ గా నా పై నమ్మకం నుంచి నాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కి హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు.గద్వాల పట్టణ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తూ గద్వాల పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్య ,దీపాలు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి వార్డ్ పై ప్రత్యేక దృష్టి పెట్టి వాడు అభివృద్ధితోపాటు గద్వాల పట్టణ అభివృద్ధికి నా వంతు సహాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో భవిష్యత్తులో గద్వాల మున్సిపాలిటీ రాష్ట్రంలోని ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 10 లక్షల నిధులతో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ..

**ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి**



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 20 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం పల్లమర్రి గ్రామంలో 10 లక్షల నిధులతో మహిళా సమైఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. అనంతరం పల్లమరి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి కుమార్తె వివాహానికి హాజరై, తదనంతరం చిన్న చింతకుంట మండల కేంద్రంలో అఖిల్ రెస్టారెంట్ పూణే బాలరాజ్ అన్న కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జియంఆర్

## ఏప్రిల్ 20 నుండి ఓపెన్ పరీక్షలు.....

నాగర్ కర్నూల్..... ఏప్రిల్ 20వ తేదీ నుండి పదవ మరియు ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కంచర్ల శివప్రసాద్ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని వారు కోరారు 20న తెలుగు 21న ఆంగ్లం 22న మ్యాచ్ మరియు పొలిటికల్ సైన్స్ 24న పదవ తరగతి సైన్స్ మరియు టెక్నాలజీకి ఇంటర్మీడియట్ కామర్స్ మరియు బిజినెస్ స్టడీస్ కు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని. 25న పదవ తరగతి సోషల్ ఇంటర్ విద్యార్థులకు చరిత్ర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని 26న పదవ తరగతి విద్యార్థులకు ఎకనామిక్స్ ఇంటర్ విద్యార్థులకు ఎకనామిక్స్ మరియు మాస్ కమ్యూనికేషన్ బయాలజీ పరీక్షలు నిర్వహించడం 27న వృత్తి విద్యా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని వారు వివరించారు

## పేటలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు



**నారాయణపేట ఫిబ్రవరి 20:( స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం గిరిజనుల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ 287 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ తండాల నుంచి మహిళలు,పురుషులు,యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.పట్టణంలో గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లా డుతూ అడవి బిడ్డలుగా ఉండి అజ్ఞానంతో ఉండిన గిరిజనులను చైతన్యం పరు స్తూ విజ్ఞులను చేశాడని అన్నారు.ఆయన చూపిన బాటలో నడిచి అభివృద్ధి చెందాలని అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.ఈ ఉత్సవాల్లో లంబాడా అధికా రులు,నాయకులు,ప్రజాప్రతినిధులు ఫణినాయక్,లక్ష్మన్ నాయక్,శరణ్య నాయక్,రవి నాయక్,విజయ్నాయక్,వెంకట్ నాయక్,రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సంతాపూర్ లో ఆర్బాటంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి తదితర నేతలు హాజరు...**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 20 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం సంతాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు వీరేశం, సంతాపూర్ గ్రామ సర్పంచ్ బర్కం యాదయ్య, ఉపసర్పంచ్ బీజ్యారం మంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్, పల్లె ఆనంద్, శ్రీధర్ రెడ్డి, సంతాపూర్ గ్రామ పంచాయితీ వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాన్ని లబ్ధిదారులు మాదారం చంద్రయ్య, కల్వకోలు భాగ్యమ్మ దంపతులు అట్టహాసంగా చేపట్టారు గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు స్థానిక నాయకులతో కలిసి కేశంపేట్ మండలంలోని సంతాపూర్ గ్రామంలో మాదారం చంద్రయ్య, కల్వకోలు భాగ్యమ్మ దంపతులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఇంటి యజమానులకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా చీరసారె పెట్టి అభినందించారు ఇందిరమ్మ గృహాన్ని మంజూరు చేసిన అనంతరం లబ్ధిదారులు ఇల్లు కట్టుకొని నేడు పండుగ చేసుకుంటున్నారు ఈ పండుగకు పెద్దమనిషిగా వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులను పిలవడంతో పూర్తిగా పండగ వాతావరణం నెలకొంది ఇలలో మనుషులకు గృహమే స్వర్గసీమ అని అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను నిరుపేదలకు అందజేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలను వంచిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత 10 ఏళ్లలో జరిగిన లోటుపాట్లను సవరించి ప్రజలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను కడతెర్చుతున్నామని అన్నారు నియోజకవర్గంలో పలు దఫాలుగా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా చేస్తానని హామీ ఇచ్చారు రాబోయే మూడేళ్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కటిస్తామని అన్నారు అదేవిధంగా పట్టణంలో మార్చి మొదటి వారంలో ఇందిరమ్మ గృహాలను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు పట్టణంలో ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని లబ్ధిదారులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు సరిత, శ్రీరాములు, ఎల్. రాజు, మాజీ వార్డు మెంబర్లు అంజయ్య గౌడ్, కే. శివారెడ్డి, ఎం. శివకుమార్ బి. శ్రీనివాసులు, ఎద్దు. చంద్రశేఖర్, ఎల్. రాజు, కే. బాలరాజ్, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డి, పంచాయతీ సెక్రటరీ శివకుమార్, టిఎస్పిడీసీఎల్ ఏ ఈ ఈశ్వర్, కేశంపేట్ సీఐ నరహరి, ఎస్ ఐ రాజ్, కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసిన డి ఎం హెచ్ వో తుకారాం రాథోడ్

**అర్హత లేని వ్యక్తులు క్లినిక్ నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు**




**భద్రాచలం ఫిబ్రవరి 20 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ . తుకారం రాథోడ్ బూర్గంపాడు భద్రాచలం పట్టణాలలోని ప్రైవేట్ నర్సింగ్ హోంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల నిర్వహణాధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రుల్లో అర్హత కలిగిన పరామెడికల్ సిబ్బంది, నర్సింగ్ అధికారులు నమోదు కలిగిన వైద్యులను తప్పనిసరిగా నియమించాలని సూచించారు. ఏవైనా లోపాలు గుర్తించిన పక్షంలో క్లినికల్ ఇష్టబ్లిషమెంట్స్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద రోగులకు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాల్సిందిగా ఆయన సూచించారు. ప్రతి ఆసుపత్రి ముందు ప్రజలకు స్పష్టంగా కనిపించే విధంగా చికిత్సల ధరల పట్టిక, విధుల్లో ఉన్న వైద్యుల పేర్ల పట్టిక, అందించే సేవల వివరాల పట్టికలను ప్రదర్శించాలని ఆదేశించారు. అదేవిధంగా, ఈ రోజు డీఎంహెచ్ఓ పాల్వంచ నాగారం కాలనీలోని షేక్ రంజాన్ అలీ పీఎంపీ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో క్రింది లోపాలు గుర్తించబడ్డాయి అర్హతలేని వ్యక్తి క్లినిక్ నిర్వహించడం. ఇంజెక్షన్లు వైద్య ప్రకటన బ్రోచర్లు కలిగి ఉండడం రోగుల కోసం రెండు చెక్క పడకలు ఏర్పాటు చేయడం బీపీ యంత్రం స్టెతస్కోప్ అందుబాటులో ఉండడం పై అక్రమాల దృష్ట్యా సంబంధిత వ్యక్తికి నోటీసు జారీ చేయబడింది. 6 రోజుల లోపు వివరణ సమర్పించాలని ఆదేశించారు. తదుపరి, డీఎంహెచ్ఓ ఎంపీ బంజారా ఉప కేంద్రాన్ని సందర్శించి అన్ని రికార్డులు, ఐఈసీ మెటీరియల్స్ ఆశాల ఫ్రైడే డ్రై డే కార్యక్రమ సర్వే ఫార్ములను పరిశీలించారు. ఎంపీ బంజారా ఆశా కార్యకర్త శ్రీమతి రాధ సేవలను అభినందించారు. అన్ని ఆశాలు నిర్దేశిత సర్వే ఫార్మాట్‌ను తప్పనిసరిగా నిర్వహించి ప్రతి నెల నివేదికలు సమర్పించడంతో పాటు పురోగతిని సమీక్షించాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల ధనలక్ష్మి ఏ యన్ ఎం (స్త్రీ )వారి పదవి విరమణ కార్యక్రమంలో కూడా డీఎంహెచ్ఓ పాల్గొనీ ప్రసాగించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఉప జిల్లా వైద్య అధికారి డా. శ్రీధర్, భద్రాచలం (గిరిజన) ఉప జిల్లా వైద్య అధికారి డా. సైదులు, నర్సాపురం వైద్య అధికారులు, మోహన్ డి పి యం ఓ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐలో చేరిన సర్పంచ్ సరస్వతి

**-కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కూనంనేని**



**కొత్తగూడెం ఫిబ్రవరి 20 (స్కై న్యూస్) :** పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావుపేట ఎస్సీ కాలనీ సర్పంచ్ బండా సరస్వతి సిపిఐ పార్టీలో చేరారు. ఆమెకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం ఎర్రకండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇండిపెంటెంట్ అభ్యర్థిగా మొన్నటి గ్రామపంచాయితీ ఎన్నికల్లో 178 ఓట్ల మెజార్టీతో సర్పంచ్గా గెలిచిన సరస్వతి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సారధ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితురాలై సిపిఐ చేరినట్లు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామ పంచాయితీ సమగ్రాభివృద్ధి సాధించాలంటే అది సిపిఐతోనే సాధ్యమని ఆమె అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన సర్పంచ్ సరస్వతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటు పడాలని, పంచాయితీలో ఉన్న ప్రతీ సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని సూచించారు. పాల్వంచ మండల సిపిఐ అనుబంధ రైతు సంఘం అధ్యక్షులు కొంగర అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికలో సిపిఐ నాయకులు వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, బొర్రా కేశవులు, రాంబాబుతో పాటు తదితరులున్నారు.

# సొంతిల్లు కుటుంబ అభివృద్ధికి పునాది

**సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**





**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 20( స్కై న్యూస్)** సొంత ఇల్లు అనేది కుటుంబ ఆర్థిక అభివృద్ధికి పునాది అని వారి కలలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 20వ వార్డులో కౌన్సిలర్ పద్మమ్మ తో పాటు పలు పథకాల లబ్ధిదారులు మరియు కాలనీవాసులతో ఆయన సమస్యలను తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం అనేకమంది పేదలకు గొప్ప వరమని అన్నారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునింద్ర వైస్ చైర్మన్ బాదం రమేష్ కౌన్సిలర్ పద్మమ్మ నిజాముద్దీన్ సునీత తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు అనంతరం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తెలకపల్లి మండలం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అంట వాళ్ళని కోరారు అనంతరం బిజినేపల్లి మండలం గంగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. వీధిలైట్లు రహదారుల నిర్మాణంతోపాటు తాగునీటి వసతి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు హరీష్ రెడ్డి తో పాటు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# జిల్లా మహిళా సమాఖ్య సమావేశం...

**ముఖ్య అతిధి గా పాల్గొన్న డి ఆర్ డి ఏ , పిడి.విద్యాచందన**




**చుంచుపల్లి ఫిబ్రవరి 20 (స్కై న్యూస్ ):**భద్రాద్రి జిల్లా మహిళా సమాఖ్య సమావేశం చుంచుపల్లి మండల సమాఖ్య కార్యాలయం నందు నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీమతి. యం. విద్యాచందన ముఖ్య అతిధి గా హాజరై జిల్లా సమాఖ్య సభ్యులకు సర్ఫ్ ద్వారా చేపడుతున్న అన్ని కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయటం జరిగింది. ముఖ్యంగా ప్రాజెక్ట్ ద్వారా సంఘ సభ్యులకు ఇచ్చిన సి. ఐ. ఎఫ్, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ డబ్బును 100% రిపేమెంట్ చేయించాలని ఆదేశించారు. పి ఎం కె ఎస్ వై ద్వారా చేపడుతున్న అన్ని కార్యక్రమాలను గ్రౌండింగ్ పూర్తచేయాలని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న యూనిఫామ్ లు స్కూల్ విద్యార్థులకే కాకుండా ప్రభుత్వం ఈసారినుండి ఆర్టీసీ డ్రైవర్స్, మెడికల్ అండ్ హెల్త్, ఫైర్ డిపార్మెంట్ కు సంబందించిన యూనిఫామ్ లు కూడా మహిళా సంఘాలకే ఇస్తుందని, యూనిఫామ్ లు కొలతల ప్రకారం మంచిగా కుట్టాలని తెలిపారు. మహిళా సంఘాల ద్వారా నడుస్తున్న ధాన్యం కొనుగోలు సెంటర్స్ మంచిగా నడపాలని, వచ్చే సీజన్ కి ఇంకా ఎక్కువ సెంటర్లు పెట్టటానికి ముందుకు రావాలి అని చెప్పారు. జిల్లాలో మంజూరైన గ్రామ సంఘ భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 10 వ తరగతి విద్యార్థులందరు బాగా చదివి 100% పాస్ అయ్యేలా ప్రతీ గ్రామం లోను వివో ఏ గ్రామ సంఘ పాలక వర్గ సభ్యులు బాధ్యత తీసుకోవాలి అని ఆదేశించారు. గ్రామాల్లో 10 వ తరగతి, ఇంటర్, ఐ. టి. ఐ, పూర్తి చేసిన 30 సంవత్సరాల లోపు వయసున్న యువతీ యువకుల వివరాలు డి ఆర్ డి ఎ కు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ డి.ఆర్.డి. ఓ. నీలేశ్ , జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి సోయం సుజాత,అన్ని మండల సమాఖ్యల అధ్యక్షులు, డీపీఎం ఎన్నీఎఫ్ , ఆర్ ఎం , ఎస్ ఎన్ , ఎపిఎం లు, అన్ని మండలాల అకౌంటెంట్ లు పాల్గొన్నారు.

# వినియోగదారులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అండగా ఉంటుంది

**తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి**

**బ్యాంక్ చైర్మన్ చేతుల మీదగా నూతన జెసిబిని అందుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 20 :-** హైదరాబాదులోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మహబూబ్ నగర్ రీజినల్ మేనేజర్ ఎల్ శిలా, మహబూబ్ నగర్ బిజినెస్ మేనేజర్ పి కిషోర్, కొత్తూరు బ్రాంచ్ మేనేజర్ కే ఉదయశ్రీ సహకారంతో నూతన జెసిబిని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శ్రీకాంత్ రెడ్డి కొనుగోలు చేశారు ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ శ్రీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు వివిధ రకాల గవర్నమెంట్ స్కీమ్స్ (ఎమ్మెస్ యమ్మి) మైక్రో స్మాల్ యూనిట్స్ ద్వారా బిజినెస్ లోన్లు విరివిగా అందజేస్తున్నట్లు వారు తెలిపారు కొత్తగా సహస్ర స్కీం ద్వారా అత్యధిక వడ్డీ రేట్లు ఇస్తున్నామని బ్యాంక్ చైర్మన్ ప్రతాపరెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా చైర్మన్ కి,బ్యాంక్ మేనేజర్ కి, శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు మామిడి సిద్ధార్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట యువతకు ఉచిత ఆన్లైన్ కోచింగ్ అందించే లక్ష్యం

**హరీష్ అన్న ఉద్యోగ యాప్ ప్రారంభం**

**సిద్దిపేట:**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుక్రవారం హరీష్ అన్న ఉద్యోగ యాప్ ను ప్రారంభించారు. హరీష్ రావు మాట్లాడుతూ మెడికల్ పారామెడికల్ కాలేజీలు, ఐటీ టవర్తో సిద్దిపేటను అతిపెద్ద ఎడ్యుకేషనల్ హబ్గా మార్చుకున్నాం. వత కేవలం ఉద్యోగాలు చేసేవారిగానే కాకుండా నలుగురికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని అన్నారు. సెల్ ఫోన్లు, ఇతర వ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి చదివితే జీవితాంతం సుఖపడతారు. పట్టుదల ఉంటే పేదరికం అడ్డుకాదని..టైలర్, ఆటో డ్రైవర్ల పిల్లలు డాక్టర్లై నిరూపించారు. హైదరాబాద్ వెళ్లి వేలు ఖర్చుపెట్టే బదులు..ఈ ఉచిత యాప్ను వాడుకుంటే మీ జీవితాలకు ఇదే గేమ్ చేంజర్, ఏ పని చేసినా దాంట్లో మంచి ఫలితాలు వచ్చినప్పుడే సంతృప్తి కలుగుతుంది. ఈ యాప్ ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చరిత్ర ఉంది. ఇక్కడ కేసీఆర్ చదువుకున్నారు. ఒక రాష్ట్రాన్ని సాధించిన నాయకున్ని అందించిన కాలేజ్. ఈ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అందించిన కాలేజ్ ఇది. నాక్ లో సిద్దిపేట డిగ్రీ కాలేజీకి ఏ గ్రేడ్ రావడానికి సిబ్బంది, ప్రిన్సిపల్ చాలా కృషి చేశారు. ఈ కాలేజీ అభివృద్ధికి నందిని సిద్దారెడ్డి, చుక్కా రామయ్య లాంటి వారు పని చేశారు. సిద్దిపేట డిగ్రీ కాలేజ్ కి తనకున్న అనుబంధాన్ని ఈమధ్య చుక్కారామయ్య కలిసినప్పుడు గుర్తు చేశారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 95% జాబ్ చేస్తామని 5% మాత్రమే వ్యాపారం చేస్తామని చేతులు ఎత్తారు. అదే గుజరాత్ లాంటి రాష్ట్రంలో వ్యాపారం చేయడానికి 95% ముందుంటారు. ఇంటర్న్ షిప్ కి ఆదరణ పెరిగింది. ఉద్యోగం చేస్తాను కాదు ఉద్యోగం ఇస్తాను అనే ఆలోచనతో మీరందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. సిద్దిపేట ఐటి టవర్ లో ఇంకా కొత్త కంపెనీలు కూడా వస్తున్నాయి. ఇక్కడి యువతకు మరిన్ని అవకాశాలు దక్కుతాయి ఎక్కువ మంది యువతులే ఉద్యోగం చేయడం సంతోషం కలిగించిన విషయం. సిద్దిపేట ఒక ఎడ్యుకేషనల్ హబ్. రిజర్వాయర్లకు కూడా సిద్దిపేటనే హబ్. ఆలయాలకు కూడా సిద్దిపేట నిలయం.. పెద్ద పెద్ద నగరాలకు కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదు కానీ మన సిద్దిపేటకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉంది. సిద్దిపేట అంటే ఒకప్పుడు పందులకు ఫేమస్. సిద్ధిపేట అంటే ఒక మోడల్ టౌన్ గా డెవలప్ చేసుకున్నాం. రైతుల కోసం గోదావరి నీళ్లు తెస్తే సిద్దిపేటలో లక్ష ఎకరాల్లో పంట పండుతున్నదని అన్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ ముందున్న సవాళ్లు



జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెర లేపాయి. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం, పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నానని ప్రకటించడం, అదే సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ఆయనకు ఫోన్ చేసి ఢిల్లీకి చర్చలకు ఆహ్వానించడం?ఈ పరిణామాలన్నీ రాష్ట్ర కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలను, అధికార రాజకీయాల నడతలను, భవిష్యత్ వ్యూహాలను ప్రశ్నార్థకంగా నిలబెట్టాయి. జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కేవలం స్థానిక సంస్థలోని ఒక హోదా మాత్రమే కాకుండా, ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ ప్రభావం, నాయకత్వ సమన్వయం, కేడర్ మనోభావాల ప్రతిబింబంగా మారింది. జీవన్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం కలిగిన నేత. ఎమ్మెల్యేగా, మంత్రిగా, శాసనసభలో ప్రతిపక్ష ధ్వనిగా తన ముద్ర వేశారు. కాంగ్రెస్ పార్టీ బలహీన దశల్లో కూడా పార్టీ పట్ల విశ్వాసం కోల్పోకుండా నిలిచిన నాయకుల్లో ఆయన ఒకరు. 2014లో తెలంగాణ ఏర్పాటుకు అనంతరం కాంగ్రెస్ ఎదుర్కొన్న రాజకీయ సంక్షోభాల్లోనూ, 2018లో భారీ పరాజయానంతరం పార్టీ పునర్నిర్మాణం లోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నేతలకు సముచిత గౌరవం లభిస్తుందనే అంచనాలు సహజమే. అయితే జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలో ఆయనకు ఎదురైన అనుభవం ఆ అంచనాలను దెబ్బతీసిందనే భావన ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య, పార్టీల బలం, కౌన్సిలర్ల సమీకరణాలు? ఈ అంశాలు చైర్‌పర్సన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించాయి. స్థానికంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మెజారిటీకి చేరువలో ఉన్నా, ప్రత్యక్ష ఎన్నికల తర్వాత రాజకీయ చర్చలు, మైత్రి యత్నాలు, క్రాస్ ఓటింగ్ అనుమానాలు వంటివి వాతావరణాన్ని ఉద్రిక్తం చేశాయి. ఈ సందర్భంలో భాజపా, భారాసా, కాంగ్రెస్ మధ్య స్థానిక స్థాయిలో జరిగిన సంప్రదింపులు కూడా ప్రాధాన్యం సంతరించు కున్నాయి. ముఖ్యంగా భారాసా నుంచి గెలిచి తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌కు అనుకూలంగా పని చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ప్రాధాన్యత జీవన్ రెడ్డి వర్గాన్ని కలవరపరిచాయి. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నేతను పక్కనపెట్టి, ఇటీవల చేరిన నాయకుడికి అవకాశమిస్తే కేడర్‌లో ఏ సందేశం వెళ్తుందన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఇక్కడ ఒక కీలక అంశం రాజకీయ పునర్వ్యవస్థీకరణ. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు విస్తరణ వ్యూహాన్ని అనుసరించడం సహజం. ఇతర పార్టీల నుంచి నాయకులను ఆకర్షించడం, స్థానిక బలాలను సమీకరించడం, ఎన్నికల లాభనష్టాలను దృష్టిలో పెట్టుకోవడం? ఇవి అధికార రాజకీయాల భాగం. అయితే ఈ ప్రక్రియలో పాత కేడర్ మనోభావాలు దెబ్బతినకుండా చూడటం కూడా సమానంగా అవసరం. జీవన్ రెడ్డి అసంతృప్తి ఈ సమతౌల్యం లోపించిందనే సంకేతాన్ని ఇస్తోంది. జీవన్ రెడ్డి "పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నాను" అని చెప్పడం కేవలం భావోద్వేగ వ్యాఖ్య కాదు; అది ఒక రాజకీయ హెచ్చరికగా కూడా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం కావు. గత దశాబ్దంలో అనేక మంది నేతలు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చారు. అధికార పార్టీ వైపు ఆకర్షణ సహజమైతే, అసంతృప్తి కారణంగా ప్రతిపక్ష వైపు మొగ్గు చూపడం కూడా జరిగిందే. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. అయితే అదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన స్పందన పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. కే.సి. వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీకి ఆహ్వానించడం ద్వారా కేంద్ర నాయకత్వం ఈ అంశాన్ని చిన్నదిగా తీసుకోవడం లేదని స్పష్టమైంది. ఇది రెండు సందేశాలను ఇస్తోంది. మొదటిది?జీవన్ రెడ్డి పార్టీకి విలువైన నాయకుడు అన్న గుర్తింపు. రెండవది?రాష్ట్ర స్థాయి సమన్వయంలో లోపాలున్నాయన్న అవగాహన. ఢిల్లీలో జరిగే చర్చలు కేవలం జగిత్యాల అంశానికే పరిమితం కాకుండా, తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకత్వ సమీకరణాలు, అధికార పంపిణీ, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించే అవకాశముంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు లభించిన ప్రాధాన్యం కూడా రాజకీయంగా పరిశీలించ దగిన అంశం. భారాసా నుంచి గెలిచి, తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేస్తున్న నాయకుడికి అవకాశమివ్వడం ద్వారా ప్రభుత్వం స్థానిక స్థాయిలో తన ప్రభావాన్ని బలోపేతం చేయాలని భావించిందనే వాదన ఉంది. రాజకీయాల్లో స్నేహ శత్రుత్వాలు శాశ్వతం కావు; ప్రయోజనాలు శాశ్వతం. ఈ దృష్టిలో చూస్తే, సంజయ్ కుమార్‌ను సమీకరించడం ఒక వ్యూహాత్మక నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ అదే సమయంలో జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతకు గౌరవం ఇవ్వకపోతే దీర్ఘకాలిక అసంతృప్తి ఏర్పడే ప్రమాదం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ అంతర్గత సమన్వయం కీలకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయానికి అనేక మంది సీనియర్ నాయకుల కృషి కారణమైంది. జిల్లాల వారీగా బలమైన నాయకత్వం లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది. జగిత్యాల వంటి ప్రాంతాల్లో జీవన్ రెడ్డి ప్రభావం గణనీయమని స్థానిక రాజకీయ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఆయన అనుచరుల సంఖ్య, కేడర్‌పై పట్టుదల, సామాజిక వర్గాల మద్దతు? ఇవి పార్టీకి ఆస్తులే. జీవన్ రెడ్డి పార్టీ మారతారా? కాంగ్రెస్ లోనే కొనసాగుతారా? అన్న ప్రశ్నలకు తక్షణ సమాధానం ఇవ్వడం కష్టం. రాజకీయంగా చూస్తే ఆయనకు మూడు మార్గాలు ఉన్నాయి. మొదటిది?పార్టీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని చర్చల ద్వారా పరిష్కరించుకోవడం. రెండవది?సక్రియ రాజకీయాల నుంచి కొంత దూరంగా ఉండడం. మూడవది?ఇతర పార్టీ ఆహ్వానం స్వీకరించడం. అయితే గత అనుభవాలను పరిశీలిస్తే జీవన్ రెడ్డి కాంగ్రెస్ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. కాబట్టి వెంటనే పార్టీ మార్పు జరిగే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఢిల్లీ చర్చల ఫలితమే దీనిపై స్పష్టతనిస్తుంది. ఈ పరిణామం మరో కోణాన్ని కూడా వెలుగులోకి తీసుకొస్తోంది?అధికార రాజకీయాల్లో గుర్తింపు, గౌరవం, భాగస్వామ్యం అన్న మూడు అంశాలు సమానంగా ఉండాలి. కేవలం పదవులు పంచడమే కాకుండా, నిర్ణయ ప్రక్రియలో సీనియర్ నేతలకు స్థానం కల్పించాలి. లేకపోతే అసంతృప్తి బయట పడటమే కాకుండా, కేడర్‌లో నిస్సహాయత పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ పోటీలు, భవిష్యత్ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్‌కు ఏకత అవసరం.జగిత్యాల చైర్‌పర్సన్ వివాదం తాత్కాలికమేనా, లేక దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామమా అన్నది రాబోయే రోజుల్లో తేలుతుంది. అయితే ఒక విషయం స్పష్టం?జీవన్ రెడ్డి వంటి నాయకుల మనోభావాలను పట్టించుకోకుండా తెలంగాణ కాంగ్రెస్ ముందుకు సాగడం సులభం కాదు. కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకోవడం సానుకూల సంకేతమే. ఇది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా కూడా చూడవచ్చు. చివరికి, ఈ సంఘటన కాంగ్రెస్‌కు ఒక పాఠం. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్తరణ వ్యూహం అవసరమే అయినా, పాత సైనికులను మరచిపోవడం ప్రమాదకరం. జీవన్ రెడ్డి నిర్ణయం ఏదైనా కావచ్చు; కానీ ఈ సంక్షోభం తెలంగాణ రాజకీయాల్లో సమన్వయ రాజకీయాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది. ఢిల్లీ చర్చల అనంతరం పరిణామాలు ఎలా మలుపు తిరుగుతాయో అన్న ఆసక్తి రాష్ట్ర రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ లో కొనసాగుతూ గౌరవప్రద పరిష్కారం సాధిస్తారా, లేక కొత్త రాజకీయ అధ్యాయం ప్రారంభిస్తారా?ఈ ప్రశ్నకు సమాధానం సమీప భవిష్యత్తులో వెలువడనుంది.

# స్థానిక విజయాల ఊపు పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వ చూపు



ప్రజా పరిషత్ ఎన్నికల నిర్వహణ గురించి, ప్రభుత్వ యోచన అనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపును సంతరించుకుంది. గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థలో కీలక స్థానం కలిగిన ప్రజా పరిషత్‌లు కేవలం పరిపాలనా యంత్రాంగం మాత్రమే కాదు; అవి గ్రామీణ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా, సామాజిక కోణాలను సమగ్రంగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన దిశ కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలనలో ఏర్పడిన అంతరాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరిపాలన తాత్కాలిక పరిష్కారమే గానీ, ప్రజా ప్రతినిధుల ద్వారా నేరుగా జరిగే పాలనకు ఇది ప్రత్యామ్నాయం కాలేదు. గ్రామీణ స్థాయిలో అభివృద్ధి పనుల ప్రాధాన్యత, స్థానిక అవసరాలపై స్పందన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ? ఇవన్నీ ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే సమర్థవంతంగా సాధ్యమవుతాయి. అందుకే పరిషత్ ఎన్నికల నిర్వహణపై ఆసక్తి పెరుగుతోంది. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ అత్యధిక స్థానాలను దక్కించుకోవడం రాజకీయంగా కీలక మలుపుగా భావించ బడుతోంది. ఈ విజయాలు గ్రామీణ, పట్టణ స్థాయిల్లో అధికార పక్షానికి బలమైన మద్దతు ఉందన్న సంకేతాలను ఇస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలను త్వరగా నిర్వహిస్తే రాజకీయ లాభం చేకూరుతుందన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయం నిర్ణయించడంలో ఈ రాజకీయ లెక్కలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పరిషత్ ఎన్నికలు నిర్వహించడం పరిపాలనా పరంగా చిన్న విషయం కాదు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల అమలు, భౌగోళిక పునర్విభజన, చట్టపరమైన అనుసరణ ? ఇవన్నీ సమన్వయంతో జరగాలి. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధత కీలకం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. రాజకీయ కోణంలో చూస్తే పరిషత్ ఎన్నికలు సాధారణ స్థానిక పోటీగా మిగలడం లేదు. ఇవి రాష్ట్ర రాజకీయాల దిశను సూచించే సూచికలుగా మారుతున్నాయి. గ్రామీణ ఓటరు తీర్పు సాధారణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి అనుకూలంగా రావడం వల్ల అదే ధోరణి పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఎన్నికల రాజకీయాల్లో స్థానిక అంశాల ప్రాధాన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి ప్రాంతంలో సమీకరణాలు వేరుగా ఉండే అవకాశం కూడా ఉంది. సామాజిక దృష్టితో పరిశీలిస్తే పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని చైతన్యవంతం చేసే ప్రక్రియ. మహిళల రిజర్వేషన్లు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, యువ నాయకత్వానికి అవకాశాలు ? ఇవన్నీ స్థానిక పాలనను సమగ్రంగా మారుస్తాయి. ఎన్నికలు జరిగితే గ్రామస్థాయి నాయకత్వం పునరుద్ధరించ బడుతుంది. ప్రజల సమస్యలు నేరుగా ప్రతినిధుల దృష్టికి చేరుతాయి. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. ఆర్థిక పరంగా ప్రజా పరిషత్‌ల ప్రాముఖ్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ మౌలిక వసతులు ? రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, పాఠశాల సదుపాయాలు ? ఇవన్నీ స్థానిక సంస్థల ద్వారానే అమలవుతాయి. ఎన్నికలు ఆలస్యం అయితే అభివృద్ధి కార్యక్రమాల్లో నిరంతరత దెబ్బతింటుంది. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల స్థానిక అవసరాలు ఉన్నతస్థాయికి చేరే ప్రక్రియ మందగిస్తుంది. అందువల్ల పరిషత్ ఎన్నికలు నిర్వహించడం గ్రామీణ అభివృద్ధికి వేగం అందించే చర్యగా భావించ బడుతోంది. రాజకీయ వ్యూహాల పరంగా అన్ని పార్టీలు గ్రామీణ స్థాయిలో తమ బలగాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. అధికార పక్షం ఇటీవల వచ్చిన విజయాల ఊపును కొనసాగించాలని చూస్తే, ప్రతిపక్షాలు తమ లోపాలను సరిదిద్దుకొని కొత్త వ్యూహాలతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం ? ఇవే ప్రధాన ప్రచార అజెండాలుగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ దృష్టిలో ఎన్నికల సమయం నిర్ణయం సున్నితమైన అంశం. పరిపాలనా సిద్ధత, న్యాయపరమైన అంశాలు, రాజకీయ సమీకరణాలు ? ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. త్వరితగతిన ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దోహదం అవుతుంది. అదే సమయంలో అన్ని ప్రక్రియలు చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి కావడం కూడా అవసరం. ప్రజల నమ్మకం నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశం. చివరగా చూస్తే ప్రజా పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబించే కీలక ప్రక్రియ. ఇటీవలి స్థానిక ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ యోచనలు, పరిపాలనా సన్నాహాలు ? ఇవన్నీ కలిసి ఒక కీలక రాజకీయ దశను సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రజల ఆశలు, అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలు ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన దిశను పొందగలవు. ప్రజాస్వామ్య వ్యవస్థ పునాది గ్రామంలోనే బలపడితేనే రాష్ట్ర పరిపాలన సమగ్రంగా ముందుకు సాగుతుంది. పరిషత్ ఎన్నికలు ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచే అవకాశముంది.

## తెలుగు సంఘం వారి సేవలు అమోఘం



ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్ నగర్, ఫిబ్రవరి 20(స్మైన్యూస్):** తెలంగాణ అమెరికా తెలుగు సంఘం వారి సేవలు అమోఘం అని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ అమెరికా తెలుగు సంఘం వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులు సమాజంలో సమాన అవకాశాలతో ముందుకు సాగేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ అమెరికా తెలుగు సంఘం సేవాభావంతో ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని వారి సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ 57 వ డివిజన్ కార్పొరేటర్ ఎం.ప్రవీణ్ కుమార్, నాయకులు టాంకర కృష్ణయ్య యాదవ్, మైత్రి యాదయ్య, లీడర్ రఘు, ఎం.రాఘవేందర్ , తెలంగాణ అమెరికా తెలుగు సంఘం సేవా సంస్థ ప్రతినిధి ఎదిర ప్రమోద్ కుమార్ తో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## శీతాకాల ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం



హలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలచీూా యూనిట్ 1,2., పాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జాతీయ సేవా పథకం శిబిరం ప్రారంభోత్సవం జరిగింది. హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ గన్ శ్యామ్ ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించి వాలంటీర్ల ఉద్దేశించి కళాశాలకు మరియు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఏడు రోజుల కార్యక్రమం గ్రామంలో ఉన్న సమస్యలన్నిటిని తెలుసుకొని కొన్నింటిని పరిష్కరించాలని సూచించినారు .మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులందరూ మూర్తిమత్వం క్రమశిక్షణతో గ్రామీణ సమస్యలను పరిష్కరించాలని కోరినారు ..ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అంటే దేశ అంతర్గత సేవ అని "డిగ్నిటీ ఆఫ్ లేబర్" ప్రతి విద్యార్థి శ్రమయుత విధానం తెలుసుకోవాలని కోరినారు. ప్రోగ్రాం ఆఫీసర్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్. యు .కాంతయ్య ప్రోగ్రాం ఆఫీసర్ .సిహెచ్ .రాజు పాలెం సర్పంచ్ .య హరిబాబు ఇబ్రహీంపేట సర్పంచి .వై వంశీకృష్ణారెడ్డి .పాఠశాల హెడ్మాస్టర్ కృపాకర్ రెడ్డి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ప్రక్షాళన ప్రారంభం

### నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

**నిజామాబాద్ :** దక్షిణ తెలంగాణలో బీజేపీ ని బలోపేతం చేయాల్సిన అవసరముంది. అభ్యర్థులను కొనుక్కోవడం కేసీఆర్ మొదలు పెట్టాడని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. కొద్ది లో మున్సిపల్, మేయర్ అవకాశాలు రాలేదు. నా నియోజకవర్గంలో ప్రక్షాళన మొదలు పెట్టాం. నా నియోజకవర్గంలో బీ ఆర్ ఎస్ కాంగ్రెస్ కు సపోర్ట్ చేసింది. కాంగ్రెస్ , బీజేపీ పొత్తు గురించి నాకు తెలియదని అన్నారు. కాంగ్రెస్ కోవర్ట్ వల్ల మెట్ పల్లి చైర్మెన్ పోయింది. మెట్ పల్లి, జగిత్యాల లో బీజేపీ ప్రక్షాళన జరిగిందని అన్నారు.

## హామీల అమలుకు నిధులు కేటాయించాలి

### సీఎం రేవంత్ కు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగలేఖ రాసారు. బహిరంగ లేఖను రాయడానికి ప్రధాన కారణం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతుంది. ఇప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 95 శాతం పెండింగ్ లోనే ఉన్న నేపథ్యంలో.. ఈ సారైన బడ్జెట్లో కేటాయింపులు చేయాలి. లేకపోతే తెలంగాణ సమాజం ఇంకా ఓపికపట్టే ప్రసక్తే లేదని గుర్తుచేస్తున్నాను. ఈసారి బడ్జెట్ లో అయినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నానని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలను పక్కన పెట్టారు. రెండు బడ్జెట్లలో హామీల అమలు కోసం కేటాయింపులు చేయని ప్రభుత్వం? ఈ బడ్జెట్లో అయినా నిధులు కేటాయించాలి. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలో హామీ ఇచ్చిన మహిళలు, వృద్ధులు, విద్యార్థి, యువత, రైతన్నల కోసం భారీగా నిధులు కేటాయించాలని అన్నారు. డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చిన మేరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలి. ఆయా వర్గాలకి రెండు సంవత్సరాలుగా ఎగగొట్టిన హామీలను, కాంగ్రెస్ ఇస్తామని చెప్పిన నిధుల బకాయిలకు ఈ బడ్జెట్లో కేటాయింపులు చేయాలి. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దాని నిలబెట్టుకోవాలి. ఈసారి కూడా హామీల అమలకు నిధులు కేటాయించకుంటే ప్రజల తరఫున ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తాం. 2026-2027 బడ్జెట్లో 6 గ్యారెంటీలు, 420 హామీలు, డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే, ఎక్కడికక్కడ మోసకారి కాంగ్రెస్ ను ప్రజలపక్షాన నిలదీస్తామని హెచ్చరించారు.



# అరటిపండు ఎప్పుడు తింటే ప్రాణాంతం!

ప్రకృతి ప్రసాదించిన అత్యంత పోషకమైన ఫలాలలో అరటిపండు ఒకటి. పొటాషియం, మెగ్నీషియం, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండే ఈ పండు తక్షణ శక్తిని అందిస్తుంది. వ్యాయామం తర్వాత లేదా ఉదయం అల్పాహారంగా అరటిపండు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. అయితే, ఏ ఆహారమైనా పరిమితి దాటితే సమస్యలు తలెత్తుతాయి. అరటిపండ్ల విషయంలో కూడా అదే వర్తిస్తుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థపై ఇవి చూపే ప్రభావాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.అరటిపండును తక్షణ శక్తినిచ్చే ఫలంగా మనం గుర్తిస్తాం. అయితే, ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావించి వీటిని అతిగా తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ మరియు తీవ్రమైన కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి అరటిపండుతో మలబద్ధకం ముప్పు! సగం పండిన లేదా పచ్చి అరటిపండ్లలో ఉండే 'రెసిస్టెంట్ స్టార్చ్' జీర్ణం కావడం చాలా కష్టంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా తీసుకుంటే జీర్ణక్రియ మందగించి మలబద్ధకానికి దారి తీసే అవకాశం ఉంది. అలాగే ఇందులోని పెక్టిన్ అనే పీచు పదార్థం పేగులలోని నీటిని పీల్చుకోవడం వల్ల మలం గట్టిపడే పరిస్థితి ఏర్పడవచ్చు. గ్యాస్ కడుపు ఉబ్బరం వేధిస్తోందా? మరోవైపు, పూర్తిగా పండిన అరటిపండ్లను అధికంగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఇందులోని కరిగే ఫైబర్, ఫ్రక్టోజ్ పేగులలోని బ్యాక్టీరియాతో కలిసి విచ్ఛిన్నం కావడంతో గ్యాస్ ఉత్పత్తి పెరుగుతుంది. అదేవిధంగా సార్బిటాల్ అనే సహజ చక్కెర ఆల్కహాల్ అధికంగా తీసుకున్నప్పుడు అజీర్తి సమస్యలు పెరగవచ్చు. ఖాళీ కడుపుతో తింటే అపాయమేనా? ఒక్కసారిగా ఎక్కువ అరటిపండ్లు తింటే పొట్టలో నొప్పి లేదా తిమ్మిర్లు అనిపించే అవకాశం ఉంది. శరీరం ఒక్కసారిగా అధిక ఫైబర్‌ను తట్టుకోలేక ఇబ్బంది పడుతుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో ఎక్కువగా తింటే ఈ సమస్యలు ఎక్కువగా కనిపించవచ్చు. కొంతమందిలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా చేరడం వల్ల వికారం లేదా వాంతుల భావన కూడా కలగవచ్చు. అతిసారం పోషకాల అసమతుల్యత ఇంకా కొందరిలో విరేచనాలు కూడా సంభవించవచ్చు. అరటిపండ్లలోని పీచు పదార్థం పేగుల కదలికను వేగవంతం చేయడం వల్ల మోతాదు మించితే అతిసారానికి దారి తీస్తుంది. అదనంగా, రోజూ ఎక్కువగా అరటిపండ్లనే తీసుకోవడం వల్ల ఇతర పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోకుండా పోషకాల అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంది. నిపుణుల సూచన: అరటిపండ్లు ఆరోగ్యానికి మంచివే, కానీ పరిమితి పాటించడం అత్యంత ముఖ్యం. సాధారణంగా ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు ఒకటి లేదా రెండు అరటిపండ్లు తీసుకోవడం సరిపోతుంది. కిడ్నీ సమస్యలు లేదా మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవడం శ్రేయస్కరం.

# క్యాబేజీ కానీ వీరికి మాత్రం విషమే!



క్యాబేజీని పోషకాలకు పవర్‌హౌస్‌గా పిలుస్తారు. ఎందుకంటే ఇది మన శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలను అందిస్తుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ ఇది అందిరికి ఒకే రమైన ప్రయోజనాలను అందించదు. కొన్ని సమస్యలు ఉన్నవారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ సమస్యలు ఉన్నవారు: క్యాబేజీ మనకు అనేక విధాలుగా ప్రయోజనాలను అందించినప్పటికీ జీర్ణ సమస్యలు ఉన్నవారు దీన్ని తీసుకునే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇందులో రాఫినోస్ అనే కార్బోహైడ్రేట్ ఉంటుంది, ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంది. అలాగే కొన్ని సార్లు పూర్తిగా జీర్ణం కాదు. ఇప్పటికే జీర్ణ సమస్యలు ఉన్నవారు. దీన్ని తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్, తిమ్మిరికి కారణమవుతుంది. అధిక ఫైబర్ కంటెంట్ సున్నితమైన కడుపు ఉన్నవారిలో విరేచనాలకు కూడా కారణమవుతుంది. కిడ్నీ రాళ్లు ఉన్నవారు: కిడ్నీ స్టోన్స్ వ్యాధితో బాధపడేవారు ఈ క్యాబేజీని తినే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇందులో ఉండే ఆక్సాలిక్ ఆమ్లం కాల్షియంతో కలిసి రాళ్లను ఏర్పరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఇప్పటికే మీరు కిడ్నీ రాళ్ల సమస్యతో బాధపడుతుంటే ఇది దాన్ని మరింత ప్రభావం చేస్తుంది. కాబట్టి ఇది మూత్రపిండాల పనితీరు నెమ్మదిగా ఉన్నవారికి వీటికి దూరంగా ఉండడం బెటర్. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు: థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు కూడా క్యాబీజీ విషయంలో జాగ్రత్త వహించారు. ముఖ్యంగా గాయిటర్ ఉన్నవారు క్యాబేజీని మితంగా లేదా వైద్యుడి సలహాతో మాత్రమే తీసుకోవాలి. క్రూసిఫెరస్ కూరగాయలలోని గాయిట్రోజెన్లు అయోడిన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి, ఇది థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఈ సమస్యలు ఉన్న వారు క్యాబేజీ తినకపోవడమే మంచింది. గుండె సమస్యలకు రక్తాన్ని పలుచబరిచే మందులు తీసుకునే వ్యక్తులు కూడా క్యాబేజీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. క్యాబేజీలో విటమిన్ కె అధికంగా ఉంటుంది, ఇది మందుల ప్రభావాన్ని తగ్గిస్తుంది, ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ఇలాంటి మందలు వాడే వ్యక్తులు కేవలం వైద్యుల సలహాతో మాత్రమే క్యాబేజీని తమ ఆహారంలో చేర్చుకోవాలి. అలెర్జీలు, ఉబ్బసం ఉన్నవారు లేదా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు దీనిని మితంగా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. కొంతమందికి క్యాబేజీ తిన్న తర్వాత హిస్టామిన్ ప్రతిచర్య వల్ల చర్మంపై దద్దుర్లు, దురద లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి క్యాబేజీ ఆరోగ్యకరమైనది అయినప్పటికీ, కొంతమందికి ఇది హానికరం కావచ్చు.. వైద్యుడి సలహా లేకుండా పైన పేర్కొన్న సమస్యలు ఉన్న వారు క్యాబేజీని తినకండి.

# వాము ఆకు రోగాలను తరిమికొట్టే బ్రహ్మాస్త్రం



వాము ఆకు అపారమైన ఔషధ గుణాలున్న సుగంధ మొక్క.. వాము ఆకులు జీర్ణశక్తిని మెరుగుపరచి, ఎసిడిటీని నివారిస్తాయి.. విటమిన్ ఎ, సి, సెలీనియం, జింక్ వంటి పోషకాలతో సమృద్ధిగా ఉండే వాము ఆకులు.. జీర్ణ సమస్యలు, నెలసరి నొప్పి, బరువు తగ్గడం, దగ్గు వంటి అనేక అనారోగ్యాలకు ఉపశమనం అందిస్తాయి. ప్రకృతి ఎన్నో సహజసిద్ధమైన, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఔషధ మొక్కలను ప్రసాదించింది. వీటితో పలు అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు.. అలాంటి ఔషధ మొక్కలలో వాము మొక్క ఒకటి.. వాము ఆకులలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు దాగున్నాయి. వాము ఆకులోని యాంటీ ఆక్సిడెంట్స్, పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేయడంతోపాటు.. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను నియంత్రిస్తాయి.. అందుకే దీనిని పవర్‌ఫుల్ హెర్బల్ ప్లాంట్ అంటారు. అయితే.. వాము ఆకులను పలు ప్రాంతాలలో పలు విధాలుగా పిలుస్తారు. స్థానికంగా "దగ్గాకు" లేదా "బజ్జీ ఆకు" అని కూడా పిలుస్తారు.. సంస్కృతంలో దీనిని కర్పూరవల్లి అని వ్యవహరిస్తారు. ఈ మొక్క అనేక ఔషధ, సుగంధ విలువలను కలిగి ఉంది. ఇది జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఎసిడిటీ సమస్యలను నివారిస్తుంది.. గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వాము ఆకులో విటమిన్ ఎ, సి, సెలీనియం, జింక్ వంటి కీలకమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీర జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. వాము ఆకులను సంప్రదాయకంగా కడుపు నొప్పి, అజీర్ణం, నెలసరి సమస్యలు, అతిసారం, బరువు తగ్గడం, పంటి నొప్పి, చనుబాలు పట్టడం, జలుబు వంటి అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఇంటి చిట్కాగా ఉపయోగిస్తారు. ఈ ఆకులు పొత్తికడుపు కండరాలను సడలించి, అపానవాయువు, మలబద్ధకం వంటి లక్షణాలను నివారిస్తాయి. వాము ఆకు కేవలం ఔషధ గుణాలను మాత్రమే కాకుండా, ఆహార పదార్థాలకు రుచిని అందించే సుగంధ మూలికగా కూడా ఉపయోగపడుతుంది. దీనిని బజ్జీలుగా, స్నాక్స్‌గా తీసుకోవచ్చు. సలాడ్లు, సూప్‌లలో చేర్చడం లేదా నేరుగా ఆకులను తినడం ద్వారా కూడా దీని ప్రయోజనాలను పొందవచ్చు. వాము ఆకు డికాక్షన్ లేదా హెర్బల్ టీ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఉదయాన్నే తాగితే మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. వాము ఆకు మొక్కలు సాధారణంగా రెండు రకాలుగా లభిస్తాయి: ఒకటి పెద్ద, ఆకుపచ్చని, మందపాటి ఆకులతో కూడిన రకం, మరొకటి అలంకరణ కోసం పెంచే వెరిగేటెడ్ రకం. ఈ రెండు రకాలూ ఔషధ ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. వాము ఆకు వంటి సుగంధ మూలికలు దోమలను నిరోధించే (మస్కిటో రెపల్లెంట్) గుణాలను కూడా కలిగి ఉంటాయి. వీటి సువాసన దోమలను దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇటువంటి ఔషధ మొక్కలను పెంచి, వాటి ప్రయోజనాలను అవగాహన చేసుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని సహజ సిద్ధంగా కాపాడుకోవచ్చు. ఈ వాము మొక్కలను కిచెన్ గార్డెన్లలో సులభంగా పెంచుకోవచ్చు. ఒక్కసారి మొక్క నాటితే చాలు.. అవి ఏపుగా పెరుగుతుంది..

# ఆవాలు వల్ల కలిగే లాభాలెన్నో..



ఆవాలు కేవలం రుచిని పెంచడం మాత్రమే కాదు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. కూరలకు ప్రత్యేకమైన వాసన, రుచి జోడించడమే కాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో కూడా సహాయపడతాయి. ఆవాలలో మెగ్నీషియం, సెలీనియం, ఒమేగా?3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. భారతీయ వంటకాలు ఆవాలు లేకుండా పూర్తి కాదనేది అతిశయోక్తి ఏమి కాదు. ఎందుకంటే.. వంటగదిలో ఆవాలు ఒక అనివార్యమైన పదార్థం. దాదాపు ప్రతి వంటకంలోనూ ఇవి ఉపయోగిస్తారు. ఆవాలు కేవలం రుచిని పెంచడం మాత్రమే కాదు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. కూరలకు ప్రత్యేకమైన వాసన, రుచి జోడించడమే కాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో కూడా సహాయపడతాయి. ఆవాలలో మెగ్నీషియం, సెలీనియం, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా సెలీనియం ఆస్తమా తీవ్రతను తగ్గించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉన్న శోథ నిరోధక గుణాలు ఆర్థరైటిస్, మైగ్రేన్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించవచ్చు. ఆవాలు వేయించిన వంటకాలు ఆకలిని పెంచడంలో, జీర్ణ ఎంజైమ్‌ల క్రియాశీలతను వేగవంతం చేయడంలో ఉపయోగపడతాయి. ఆవాలకు సహజ రక్షణ గుణాలు కూడా ఉన్నాయి. ఊరగాయల్లో ఆవాలు వేయడం వల్ల బూజు ఏర్పడకుండా నిరోధించవచ్చు. మాంసం వండేటప్పుడు కొద్దిగా ఆవాలు జోడిస్తే అది త్వరగా బ్రౌన్ అవుతుంది. చేపల కూర వండే ముందు ఉప్పుతో పాటు ఆవాల పొడి కలిపితే చేపలలో ఉండే అసహజ వాసన తగ్గుతుంది.ఆవాల యొక్క పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, కూరలో వేసే ముందు స్వల్పంగా వేయించడం మంచిది. ఆకుకూరలు తయారు చేసే సమయంలో ఆవాలను రుబ్బి వేయడం కంటే స్వల్పంగా దంచి వేయడం వల్ల రుచి, పోషక గుణాలు మరింత మెరుగుపడతాయి. నల్ల ఆవాలు, తెల్ల ఆవాలు వంటి రకాలున్నప్పటికీ, భారతీయ నల్ల ఆవాలు రుచి, గుణాల పరంగా విశిష్టమైనవిగా భావించబడుతున్నాయి. ఆవాలను ప్రతిరోజు వంటల్లో సరిగ్గా ఉపయోగిస్తే, రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా సులభంగా పొందవచ్చు.

# బిజినెస్

## ఏసీ ధరలు పెరుగుతున్నాయ్




ఎండాకాలం మొదలైంది. పెరిగే ఉష్ణోగ్రతల కారణంగా ఏసీలకు పెద్ద ఎత్తున గిరాకీ ఉండనుంది. అయితే, కొత్త ఏసీ కొనాలనుకునే వారికి కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి. ప్రస్తుత త్రైమాసికంలో ఎయిర్ కండిషనర్(ఏసీ) ధరలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఇప్పటికే 10-15 శాతం మేర ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల మధ్య ధరల పెంపును నివారించలేమని బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ అన్నారు. రాగి లాంటి కీలక ముడి సరుకుల ధరలు భారీగా పెరిగాయని, దీనికి తోడు భారత కరెన్సీ రూపాయి మారకం రేటు వల్ల ఏసీ ఖర్చులను పెంచుతున్నాయి. దీనికి అదనంగా ఇంధన-సామర్థ్య లేబులింగ్ లాంటి కొత్త నిబంధనలు కూడా ఖర్చుల భారం పెంచుతోందని త్యాగరాజన్ తెలిపారు. అయితే, పరిశ్రమ కేవలం 8-10 శాతం తక్కువ లాభాల మార్జిన్‌తో కొనసాగుతోందని, కాబట్టి ముడిసరుకు వ్యయాన్ని భరించే స్థితిలో కంపెనీలు లేవు. ఫలితంగా అదనపు ఖర్చుల భారాన్ని కొంతమేర వినియోగదారులకూ బదిలీ చేయక తప్పదని స్పష్టం చేశారు. కొత్త ఎనర్జీ లేబుల్ నిబంధనల వల్లే ఏసీ స్టార్ రేటింగ్‌ని బట్టి ధరలు 5-10 శాతం పెరుగుతాయని త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. కంపెనీలు సాధారణంగా మెరుగైన డిజైన్, సామర్థ్యం ద్వారా ఖర్చులను తగ్గించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈసారి పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, కరెన్సీ ఒత్తిడి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడాన్ని కష్టతరం చేశాయని పేర్కొన్నారు.

## కోడింగ్ కంటే ఏఐతో పనిచేయించడం ముఖ్యం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ గ్రామర్‌ను తిరిగి రాస్తోంది, ఇకపై టెక్ నిపుణులకు కోడ్స్ రాయడం అంత ముఖ్యమైన పని కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని అన్నారు.మంగళవారం బెంగళూరులో జరిగిన ఇన్ఫోసిస్ ఇన్వెస్టర్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇంటర్నెట్ నుంచి స్మార్ట్‌ఫోన్‌లకు గతంలో జరిగిన ఏ సాంకేతిక మార్పు కూడా ఇంత వేగంగా జరగలేదు. వాటి కంటే వేగంగా ఏఐని అలవాటు చేసుకుంటున్నారని, వ్యాపారాల నిర్వహణను పూర్తిస్థాయి మార్చేందుకు ఏఐ సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కోడ్స్ రాయడం అంత ముఖ్యం కాకపోవచ్చు, ఏఐతో పని చేయించడం, టూల్స్‌ను వాడి వ్యాపారాభివృద్ధిని సాధించడమే అత్యంత ప్రధానం.రానున్న రోజుల్లో "కంపెనీలు కస్టమర్లకు అందించే సేవలు, పని చేసే విధానం, సంస్థ ఉద్దేశాల్లో మార్పులు రావాలి. ఇకమీదట ఏ మాత్రం పాత పద్ధతిలోనే సంస్థలు పనులు చేయలేవని నందన్ నీలేకని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గే ఛాన్స్ ఉన్నా సరే, కొత్త ఉద్యోగాలు కూడా అంతే వేగంగా పుట్టుకొస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రపంచ వ్యాప్తంగా యూట్యూబ్ డౌన్




ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అయిన యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. ఎక్స్ (ట్విట్టర్)లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫిబ్రవరి 17 సాయంత్రం యూట్యూబ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఔటేజ్ అని చెబుతున్నారు. దీనిపై యూజర్స్ పలు సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 3 లక్షలకు పైగా యూజర్లు తమ సమస్యను రిపోర్ట్ చేశారు. ఒక్క అమెరికాలోనే 2.4 నుండి 3.2 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయి. యూట్యూబ్ ఓపెన్ అవకుండా "హనీఎవబిష్ట్రతినిణ లివనిబి లితీనీనిణ" అనే ఎర్రర్ మెసేజ్ చూపించిందని పేర్కొన్నారు. యాప్ మరియు వెబ్‌సైట్ లోడ్ కాకపోవడం, వీడియోలు ప్లే అవకపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇండియా, ఐఐ, కెనడా, బ్రెజిల్ వంటి అనేక దేశాల్లో ఈ ఇష్యూస్ కనిపించాయి. దీనిపై స్పందించిన యూట్యూబ్.. సమస్య ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం అని మాత్రమే తెలిపింది. కాగా రాయిటర్స్, టెక్ రీడర్స్ వంటి అంతర్జాతీయ మీడియా దీనిని సాధారణ టెక్నికల్ గ్లిచ్ గా అభివర్ణించాయి. ఇందులో ఎలాంటి హ్యాకర్స్ కుట్ర లేదని తెలిపాయి. అదే విధంగా ఫిబ్రవరి 16న ఎక్స్ కూడా కొన్ని గంటల పాటు ఔటేజ్ కి గురైంది. నమోదైంది. 2 గంటల పాటు ఫీడ్ రిఫ్రెష్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, యాప్ లోడ్ అవకపోవడం వంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పీక్ అవర్ లో 40,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయి. కాగా దీనిపై 'ఎక్స్' కూడా అధికారికంగా స్పష్టమైన కారణం చెప్పలేదు. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ హ్యాకింగ్ గాని డేటా బ్రీచ్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. పెద్ద ప్లాట్‌ఫామ్స్‌కి ట్రాఫిక్ పెరగడం, సర్వర్ మెయింటెనెన్స్, క్లౌడ్ సర్వీస్ సమస్యలు, నెట్‌వర్క్ లోపాలు వంటి కారణాల వల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఔటేజెస్ రావడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ హ్యాకింగ్ జరిగితే డేటా లీక్, అకౌంట్ సస్పెన్షన్, సెక్యూరిటీ అలర్ట్స్ కనిపిస్తాయి. యూట్యూబ్, ఎక్స్ ఔటేజ్ లో అలాంటివేవీ కనబడక పోవడంతో ఇవి సాధారణ సాంకేతిక లోపాలే అని చెప్పవచ్చు.

## ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 83 శాతం పతనం

## భారీగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




ఎంతో ఆర్భాటంగా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించిన ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు కుప్పకూలిపోతున్నాయి. ఆల్‌టైం గరిష్టాల నుంచి భారీ నష్టాలను చవి చూడటంతో ఇన్వెస్టర్లు లబోదిబోమంటున్నారు. వరుసగా నాలుగో రోజు మంగళవారం కూడా ఓలా షేర్లు పతనమయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం క్షీణించి 27.36 కనిష్ట స్థాయిని తాకగా.. తుదకు 2.91 శాతం నష్టంతో రూ.27.99 వద్ద ముగిసింది. ఓలా రేటింగ్‌ను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సిటీ 'బై' నుంచి 'సెల్'కి తగ్గిస్తూ.. టార్గెట్ ధరకు 51 శాతం కోత పెట్టి రూ.27గా నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణం. 2024లో చేరిన గరిష్ట స్థాయి రూ.157తో పోలిస్తే ఈ స్టాక్ ఏకంగా 83శాతం మేర పడిపోయి ఇన్వెస్టర్ల సంపదను ఆవిరి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయం 55 శాతం తగ్గి రూ.470 కోట్లకు పడిపోయింది. నికర నష్టం రూ.487 కోట్లకు పెరగడం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళన పెంచింది. ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతం మార్కెట్ వాటాతో ఐదో స్థానానికి పడిపోయింది. టీవీఎస్, బజాజ్, ఆథర్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటుంది. వినియోగదారుల నుంచి సర్వీస్, నాణ్యత పరంగా వస్తున్న ఫిర్యాదులు బ్రాండ్ విలువను దెబ్బతీశాయి. మరోవైపు కంపెనీ వద్ద నగదు నిల్వలు తగ్గడం, అప్పులు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

## తొలి ఈవీ కారును విడుదల చేసిన మారుతీ సుజుకి



దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి ఎట్టకేలకు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంలోకి అడుగుపెట్టింది. మంగళవారం కంపెనీ ఎంతో ఆసక్తిగా ఎదురూచుస్తున్న తన మొట్టమొదటి ఈవీ ఎస్‌యూవీ ఈ-విటారా లాంచ్ చేస్తూ, ధరల వివరాలను కూడా ప్రకటించింది.రూ. 10.99 లక్షల ప్రారంభ ధరతో తీసుకొచ్చిన ఈ కారు బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్(బాస్) మోడల్ ఆధారంగా లభిస్తుంది. అంటే బ్యాటరీ కోసం ఈఎంఐ రూపంలో కిలోమీటర్‌కు రూ. 3.99 చొప్పున విడిగా చెల్లించాల్సి ఉంటుంది. 8 ఏళ్ల బ్యాటరీ వారెంట్‌తో అందుబాటులో ఉన్న ఈ కారు 49 కిలోవాట్ అవర్, 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్లతో లభిస్తుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేసిన తర్వాత 440 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. 61 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 543 కిలోమీటర్లు వెళ్లొచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారును కొనాలనుకునే కస్టమర్లు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ లేదా డీలర్‌షిప్ సెంటర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి బుకింగ్ చేయవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభం అవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. అలాగే, త్వరలో పూర్తి వేరియంట్ వారీగా ధరల వివరాలను వెల్లడించనున్నట్టు తెలిపింది. గతేడాది ఆగష్టులోనే కంపెనీ ఈ-విటారా ఉత్పత్తిని ప్రారంభించింది. ఏడాది ఆఖరు నాటికి సుమారు 13 వేల యూనిట్లను 28 దేశాలకు ఎగుమతి కూడా చేసింది.

# దూబే మెరుపులు..

# అజేయంగా సూపర్ 8కు టీమిండియా..!




హ్యాట్రిక్ విజయాలతో సూపర్ 8కు దూసుకెళ్లిన భారత్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ జయభేరి మోగించింది. టాపార్డర్ రాణించకున్నా శివం దూబే(66) అర్ధ శతకంతో కదం తొక్కి భారీ స్కోర్ అందించగా.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3-14) బంతితో నెదర్లాండ్స్ బ్యాటర్లను హడలెత్తించాడు. లీడే(33), అకెర్‌మన్(23)లు పోరాడినా.. 176కే కట్టడి చేసింది. 17 పరుగుల తేడాతో విజయం సాధించి.. అజేయంగా నాకౌట్ దశకు చేరుకుంది. మూడోసారి పొట్టి ప్రపంచకప్‌పై గురి పెట్టిన భారత్.. లీగ్ దశను అజేయంగా ముగిచింది. గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు చేరుకున్న టీమిండియా.. చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివం దూబే(66) మెరుపులతో 193 రన్స్ కొట్టిన భారత జట్టు.. అనంతరం వరుణ్ చక్రవర్తి(3-14), దూబే(2-35)లు రాణించగా కట్టడి చేసింది. భారత్ నిర్దేశించిన లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ ఓపెనర్లు దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. అయితే.. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వారి వ్యూహం ఫలించలేదు. వరుణ్ చక్రవర్తి తొలి బ్రేకిస్తూ మ్యాక్స్ డీ డౌడ్(20)ను ఔట్ చేశాడు. అనంతరం.. పాండ్యా ఓవర్లో మైఖేల్ లెవిట్(24)ను పెవిలియన్ చేర్చగా.. బాస్ డీ లీడే(33), కొలిన్ అకెర్‌మన్(23)లు ధాటిగా ఆడారు. కానీ. దూబే ఓవర్లో లీడే ఔట్ కాగా.. అకెర్‌మన్‌ను చక్రవర్తి డౌగట్ పంపాడు. దాంతో.. 94కే నాలుగు వికెట్లు కోల్పోయిన డచ్ జట్టు.. ఇన్నింగ్స్ 120లోపే ముగిస్తుందనిపించింది. కానీ.. ఆఖర్లో జాజ్ లయన్ (26), నోహ్ క్రొయెస్(25 నాటౌట్) బౌండరీలతో చెలరేగి ఓటమి అంతరాన్ని తగ్గించారు.

### దూబే, పాండ్యా ధనాధన్

అహ్మదాబాద్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటైనా.. శివం దూబే(66) శివాలూగిపోయాడు. టాపార్డర్ విఫలమైనా నేనున్నానుగా అంటూ అర్ధ శతకంతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు భారీ స్కోర్ అందించాడు. తిలక్ వర్మ,(31), సూర్యకుమార్ యాదవ్(34) మెరుపులను కొనసాగించిన దూబే.. నెదర్లాండ్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. హార్దిక్ పాండ్యా(30)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన దూబే.. ఈ టోర్నీలో రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. డెత్ ఓవర్లలో దూబే, పాండ్యా మరింత చెలరేగడంతో ప్రత్యర్థికి టీమిండియా 194 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

## ఫర్హాన్ సూపర్ సెంచరీ



**కొలంబో:** సూపర్-8కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో పాక్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం నమీబియాతో జరిగిన పోరులో పాక్ 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ ఓపెనర్ ఫర్హాన్(58 బంతుల్లో 100 నాటౌట్, 11ఫోర్లు, 4సిక్స్‌లు) సూపర్ సెంచరీతో చెలరేగిన వేళ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. మరో ఓపెనర్ ఆయూబ్(14) నిరాశపరిచినా ఫర్హాన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పాక్‌కు భారీ స్కోరు అందించడంలో కీలకమయ్యాడు. పసలేని నమీబియా బౌలింగ్‌ను సులువుగా ఎదుర్కొంటూ సాధికారిక ఇన్నింగ్స్ నిర్మించాడు. 57 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్న ఫర్హాన్.నాలుగో వికెట్‌కు షాదాబ్‌ఖాన్(36నాటౌట్ )తో కలిసి 81 పరుగుల అజేయ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఛేదనలో నమీబియా..ఉస్మాన్ తారీఖ్(4/16), షాదాబ్‌ఖాన్(3/19) ధాటికి 17.3 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలింది.

# స్పోర్ట్స్

## శ్రీలంకకు ఊహించని షాక్.. వరల్డ్‌కప్ నుంచి యార్కర్ కింగ్ ఔట్..!



పొట్టి ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు సమయం దగ్గర పడింది. లీగ్ దశలో మాదిరిగానే సూపర్ 8లోనూ అదరగొట్టాలని పట్టుదలతో ఉన్నాయి. అంతలోనే శ్రీలంకకు ఊహించని షాక్ తగిలింది. ఇప్పటికే ప్రధాన పేసర్ ఇషాన్ మలింగ, స్పిన్నర్ వనిందు హసరంగ సేవల్ని కోల్పోయిన లంక.. నాకౌట్ దశకు ముందే యువ పేసర్ మథీశ పథిరన సేవల్ని కోల్పోనుంది. కాలి పిక్క కండరాలతో బాధ పడుతున్న పథిరన టోర్నీ నుంచి వైదొలిగాడని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తెలిపాడు.

గ్రూప్ బీలోని శ్రీలంక లీగ్ దశ మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడింది. ఈ మ్యాచ్‌లోనే పథిరన ఎడమ కాలి నొప్పితో బాధపడ్డాడు. నాలుగు బంతులు వేసిన తర్వాత అతడు కాలు పట్టుకొని విలవిలలాడాడు. ఫిజియో వచ్చి పరీక్షించినా ఉపశనమం లేకపోవడంతో మైదానం వీడాడు. ఆ తర్వాత అతడు బౌలింగ్‌కు రాలేదు. దాంతో.. గాయం తీవ్రత పెద్దదే అనుకున్నారంతా. అనుకున్నట్టే.. పథిరన వరల్డ్‌కప్‌లో కీలక మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. గురువారం జింబాబ్వేతో మ్యాచ్ ఉన్నందున బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ మాట్లాడుతూ పథిరన ఆరోగ్యంపై అప్‌డేట్ ఇచ్చాడు.

'ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో గాయపడిన పథిరన ఇంకా కోలుకోలేదు. టోర్నమెంట్‌లో తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు అతడు ఫిట్‌గా లేడు. వరల్డ్‌కప్ నుంచి పథిరన వైదొలిగాడని అధికారికంగా ప్రకటించలేదు. త్వరలోనే శ్రీలంక క్రికెట్ ఈ విషయాన్ని వెల్లడిస్తుంది. ప్రస్తుతానికైతే అతడి స్థానంలో ఎవరిని తీసుకోవాలి? అనేది ఇంకా నిర్ణయించలేదు' అని విక్రమ్ రాథోడ్ పేర్కొన్నాడు. యార్కర్లతో వికెట్లు పడగొట్టే పథిరన నాకౌట్ మ్యాచ్‌లకు దూరమవ్వడం ఆతిథ్య జట్టుకు పెద్ద లోటే. సూపర్ 8లో న్యూజిలాండ్, ఇంగ్లండ్, పాకిస్థాన్‌తో లంక తలపడనుంది.

# ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఒకప్పటి హీరోయిన్ కూతురు

దక్షిణాది వెండితెరపై ఒకప్పుడు ఓ వెలుగు వెలిగి ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న సీనియర్ నటి ఖుష్బూ వారసురాలు అవంతిక సుందర్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుంది. 'ఆరంభం' అనే మలయాళ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని స్టార్ట్ చేస్తుంది ఈ బ్యూటీ. సుజేష్ అన్నీ ఈపెన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆమె 'ఆరతి' అనే పాత్రలో కనిపించనుంది. ఇక ఖుష్బూ కూడా మలయాళ సినిమాతోనే తన సినీ ప్రయాణాన్ని స్టార్ట్ చెయ్యగా.. కూతురు అవంతిక సుందర్ కూడా మంచి విజయాన్ని అందుకుని హీరోయిన్‌గా ఎదగాలని ఆశిస్తున్నారు అభిమానులు. కాగా.. 'ఆరంభం' చిత్రంలో సరిత, ఇంద్రన్స్, విజయరాఘవన్ వంటి దిగ్గజ నటీనటులు కూడా నటిస్తుండటంతో అవంతికకు ఇదొక మంచి ఆఫర్‌గా చెబుతున్నారు నెటిజన్లు.





# క్లైమాక్స్‌కి ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి

అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్‌గా.. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బుకీ'. గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ఇప్పటికే తమిల్‌లో విడుదలై బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించగా మూవీ ప్రజెంటర్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. 'ఈ వేడుకకు మంచు లక్ష్మి రావడం చాలా ఆనందంగా ఉంది. వారితో కలిసి మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను. గణేష్ అద్భుతమైన డిఓపీ, దర్శకుడు. ఈ సినిమా మ్యాసీవ్ హైబడ్జెట్ మూవీలా కనిపించదానికి కారణం కూడా తన విజన్. ఈ సినిమా తర్వాత కచ్చితంగా మీరందరూ ఆయన్ని సపోర్ట్ చేస్తారు. బుకీ కూడా తన నటనతో మీ అందరినీ అలరిస్తుంది. తెలుగు ఆడియన్స్ ఒక మంచి టాలెంట్‌ని సపోర్ట్ చేస్తారు. తనని కూడా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తున్నప్పుడు ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి. అంతా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. చాలా మంచి సినిమా. ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో చూసి తప్పకుండా మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు. యాక్ట్రెస్ మంచు లక్ష్మి మాట్లాడుతూ.. 'గత శుక్రవారం ఈ సినిమా తమిళ్లో రిలీజ్ అయ్యి అద్భుతమైన రెస్పాన్స్‌ని అందుకుంది. ఇది యూనివర్సల్‌గా కరెక్ట్ అయ్యే సినిమా అజయ్ ధనుషా ఇలా మంచి టీం తో కలిసి చేసిన సినిమా ఇది. విజయ్ ఒక సినిమాకి మ్యూజిక్ ఇస్తున్నారంటే ఆ కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. డైరెక్టర్ గణేష్‌కి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన క్యారెక్టర్ చేశాను. ఇందులో క్యారెక్టర్ ఎక్స్‌ప్రెషన్స్ చాలా గమ్మత్తుగా ఉంటాయి. ఈ సినిమా తమిళ్లో అద్భుతమైన పేరు సంపాదించుకుంది. ఇది యూత్ ఫుల్ సినిమా. తెలుగులో కూడా సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను' అన్నారు.

# చూసే వాళ్లకు చిన్నది కావచ్చు

ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్స్‌లో మలయాళ తార మమితాబైజు ఒకరు. 'ప్రేమలు'తో ఒక్కసారిగా ఫేమస్ అయిన మమితా.. ప్రస్తుతం కోలీవుడ్, టాలీవుడ్, మాలీవుడ్‌లో ఆఫర్లు అందుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రజెంట్ కోలీవుడ్ స్టార్ సూర్యతో ఓ సినిమా చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సూర్యపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'సూర్య, నేను 'సూర్య46' షూటింగ్‌లో చాలా సరదాగా గడిపాం. సూర్య సార్ ఎప్పుడూ స్పెషల్ కాఫీ తాగుతుంటారు. అది చాలా చాలా బాగుంటుంది. నేను ఆయన అసిస్టెంట్లను ఏ కాఫీ తాగుతున్నారో అడిగేదాన్ని. ఒకసారి నేను అడిగడం చూసిన సూర్య షూటింగ్ పూర్తయ్యే వరకు ప్రతిరోజూ ఆ కాఫీ నేను కూడా తాగేలా చూసుకున్నారు. ఇది చిన్న విషయమే కావచ్చు కానీ నాకు చాలా పెద్ద విషయం' అని తెలిపింది. కాగా.. సూర్య, మమితా జంటగా నటిస్తున్న చిత్రం 'సూర్య46'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రాబోతున్న ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు జి.వి. ప్రకాష్ సంగీతం అందిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 2026 జూలైలో రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది.



వార్తాతరంగాలు



## ఎస్ఐఆర్‌కు సన్నాహకాలు

## వీలైనంత త్వరగా పూర్తి చేయాలి'

ఓటరు జాబితాకు సంబంధించి దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఆ దిశగా చర్యలను ముమ్మరం చేసింది. ఎస్ఐఆర్‌కు సంబంధించి సన్నాహక పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ నుంచి ఎస్ఐఆర్ మొదలయ్యే అవకాశం ఉంది. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పూర్తయితే దేశమంతా ఆ ప్రక్రియ సంపూర్ణమవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ బిహార్‌లో పూర్తి కాగా మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. అసోంలో ఎస్ఐఆర్ స్థానంలో నిర్వహించిన ఎస్ఆర్ ఈనెల 10న పూర్తయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

## ఏఐను చూసి కొందరు భయపడుతున్నారు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని చూసి కొందరు భయపడుతున్నారని, కానీ అందులో దేశ భవిష్యత్తును భారత్ చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దేశ భవిష్యత్ వికాసంలో మైలురాయిలా ఏఐ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల, ఆశావాద దృక్పథంతో ఏఐ ఆవిష్కరణలను భారత్ స్వాగతిస్తోందన్నారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు-2026లో భాగంగా గురువారం దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమాన్ని ఉద్దేశించి మోదీ కీలకోపన్యాసం ఇచ్చారు. ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ప్రజాస్వామికీకరణ జరగాలని భారత్ కోరుకుంటోందని ప్రధానమంత్రి వెల్లడించారు. ప్రత్యేకించి గ్లోబల్ సౌత్ దేశాలకూ ఏఐ ఫలాలు అందాలన్నారు. అందుకే సర్వజన హితాయ, సర్వజన సుఖాయ (అందరి సంక్షేమం, అందరి సంతోషం) అనే థీమ్‌తో ఏఐ ఇంపాక్ట్ సదస్సును భారత్ నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక ఏఐ సదస్సును భారత్ నిర్వహిస్తుండటం యావత్ గ్లోబల్ సౌత్‌కు గర్వ కారణమన్నారు. కొత్త టెక్నాలజీని తయారు చేయడంతో పాటు దాన్ని అందిపుచ్చుకోవడంలోనూ భారత్ ముందుంటుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా టెక్ నిపుణులు లభించే కేంద్ర బిందువుగా భారత్ ఎదిగిందన్నారు.

**'ఏఐకు సరైన దిశ లేకుంటే విధ్వంసమే'**

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది విప్లవాత్మక శక్తి. దానికి సరైన దిశ అనేది లేకుంటే, అదొక విధ్వంసంలా పరిణమిస్తుంది. ఒకవేళ సరైన దిశను ఏఐకు చూపిస్తే, అదొక ఉపయోగకర ఉపకరణంగా మారిపోతుంది. మెషీన్ సెంట్రిక్‌గా ఉన్న ఏఐ టెక్నాలజీని మానవ కేంద్రిత ఉపకరణంగా ఎలా మార్చాలి? సెన్సిటివ్ స్థితిలో ఉన్న ఏఐను బాధ్యతాయుత స్థితిలోకి ఎలా తీసుకెళ్లాలి? ఈ అంశాలపై చర్చించడం, తగిన పరిష్కారాలను కనుగొనడమే భారత్ నిర్వహిస్తున్న గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సదస్సు ప్రధాన లక్ష్యం. అందరి సంక్షేమం, అందరి సంతోషం అనే థీమ్‌తో ఈ సదస్సును మేం నిర్వహిస్తున్నాం. దీన్నిబట్టి ఏఐను భారత్ ఎలా చూస్తోందో అందరూ స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మేం అందరి సంక్షేమం, అందరి సంతోషం కోసమే ఏఐను వినియోగిస్తాం' అని ప్రధాని మోదీ వెల్లడించారు.

**అణుశక్తిలాగే ఏఐకీ రెండు కోణాలు : మోదీ**

'అత్యుత్తమ దేశ నిర్మాణానికి కూడా ఏఐ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. ఈవిషయంలో ఏఐ పరిశ్రమతో ప్రపంచ దేశాలు కలిసి పనిచేయాలి. ప్రస్తుతానికి ఏఐతో దేశం కోసం ఏమేం చేయగలం అనేది ఆలోచించాలి. భావితరాలకు ఎటువంటి ఏఐ టెక్నాలజీని అందించాలి అనే దానిపైనా మనం శ్రద్ధ పెట్టాలి. ప్రతి టెక్నాలజీలోనూ మంచి, చెడు అనే రెండు కోణాలు ఉంటాయి. అణుశక్తి కలిగిన అణుబాంబును వినియోగించడం వల్ల జరిగిన విధ్వంసాన్ని మనం చూశాం. ఇప్పుడు అదే అణు ఇంధనంతో మనం జీవితాలను మార్చుకుంటున్నాం. అందరి సంక్షేమానికి ఉపయోగపడే ఏఐ ఈ ప్రపంచానికి కావాలి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**జీపీఎస్‌లా ఏఐను మన కంట్రోల్‌లో పెట్టుకోవాలి**

'ఏఐ టెక్నాలజీ అనేది మానవ సామర్థ్యాలను పెంచుతుంది. దీన్ని అందిపుచ్చుకునేందుకు మనం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలి. ఇప్పటికే ఉన్న స్కిల్స్‌ను మెరుగుపర్చుకోవాలి. జీవితాంతం కొత్తకొత్త అంశాలను నేర్చుకుంటూ ముందుకుసాగాలి. తద్వారా మానవ కేంద్రిత ఏఐ సాకారం అవుతుంది. ఏఐ దృష్టిలో మనుషులు కేవలం డేటా పాయింట్స్ లాంటివారు. అందుకే ఏఐ టెక్నాలజీని ప్రపంచంలో అందరికీ అందుబాటులోకి తేవాలి. ఆకాశమే హద్దుగా వ్యాపించే అవకాశాన్ని ఏఐకు మనం ఇవ్వాలి. కాకపోతే, జీపీఎస్‌లా దాని కమాండ్‌ను మన చేతుల్లోనే పెట్టుకోవాలి. మనకు అవసరమైనప్పుడే జీపీఎస్‌ను వినియోగిస్తాం. లేదంటే వినియోగించం. డీప్ ఫేక్స్ కట్టడి, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై మార్గదర్శకాలు వంటి విషయాల్లో వెంటనే అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పన జరగాలి. డీప్ ఫేక్స్, ఏఐ జనరేటెడ్ కంటెంట్‌తో సామాజిక అస్థిరతను క్రియేట్ చేసే ముప్పు ఉంటుంది. అందుకే ప్రజలు అసలైన కంటెంట్‌ను, ఏఐ కంటెంట్‌ను నిర్దిష్టంగా గుర్తించేలా ప్రత్యేక లేబుల్స్‌ను తప్పక వినియోగించాలి' అని ప్రధాని మోదీ చెప్పారు.

**తొలి వైర్‌లెస్ సిగ్నల్ లాంటిదే ఏఐ విప్లవం : మోదీ**

'ప్రపంచంలోనే తొలిసారిగా టెలికాం వైర్‌లెస్ సిగ్నల్స్‌ను ప్రసారం చేసిన రోజున, యావత్ ప్రపంచం ఈజీగా లైవ్‌లో కనెక్ట్ కాగలదని ఏ ఒక్కరూ ఊహించలేకపోయారు. ఏఐ టెక్నాలజీ కూడా మానవ చరిత్రలో అలాంటి పెను విప్లవమే. ప్రస్తుతం మనం చూస్తున్నది, అంచనా వేస్తున్నది, కేవలం ఏఐ తొలి ప్రభావాన్ని మాత్రమే. ప్రజా ప్రయోజనకర ఉపకరణంగా ఏఐను భారత్ చూస్తోంది. ఏఐ టెక్నాలజీ మెషీన్లను ఇంటెలీజెంట్లుగా మార్చేస్తోంది. దీంతోపాటు అది మానవ సామర్థ్యాలనూ చాలారెట్లు పెంచుతోంది. కానీ ఒకేఒక తేడా ఉంది. వేగం, సామర్థ్యం విషయంలో ఏఐ అందరి అంచనాలను మించిపోయింది. గతంలో సమాజంపై టెక్నాలజీ ప్రభావం కనిపించడానికి దశాబ్దాల సమయం పట్టేది. ఇప్పుడు మెషీన్ లెర్నింగ్ నుంచి లెర్నింగ్ మెషీన్స్ వరకు అంతా వేగంగా, సమగ్రంగా, స్థూలంగా జరిగిపోతోంది' అని ప్రధాని మోదీ చెప్పారు.

## ముందస్తు అనుమతి తీసుకోకుండా

## దేశం విడిచి వెళ్లను

## సుప్రీంకోర్టుకు అనిల్ అంబానీ

ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని, రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ సుప్రీంకోర్టు తెలియజేశారు. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉందని ఆరోపణలున్న రూ.40,000 కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై ఏజెన్సీల దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. చట్టం నుంచి తప్పించుకునే ఉద్దేశం తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని అనిల్? అంబానీ పేర్కొన్నారు.

"2025 జులై నుంచి ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు జరుగుతోంది. అయితే, అప్పటినుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ప్రస్తుతం దేశం విడిచి వెళ్లే ఉద్దేశం లేదు. ఒకవేళ భవిష్యత్తులో వెళ్లాల్సివస్తే, కోర్టు నుంచి ముందస్తు అనుమతి పొందుతాను. దర్యాప్తు బృందాలకు నేను అత్యంత నిజాయతీతో పూర్తిగా సహకరిస్తున్నాను. అలాగే కొనసాగిస్తాను." అని అనిల్ అంబానీ పేర్కొన్నారు.

**'దర్యాప్తునకు నేను పూర్తిగా సహకరిస్తా'**

అయితే, అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని, ఈ కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన పిల్‌కు ప్రతిస్పందనగా అనిల్ అంబానీ అఫిడవిట్ దాఖలు చేశారు. తన ప్రవర్తన పారదర్శకంగా, సహకారంగా ఉందని నిరూపించడానికి ఈ అఫిడవిట్ దాఖలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా, అనిల్ అంబానీ చివరగా 2025 ఆగస్టులో ఒకసారి ఈడీ ముందు హాజరయ్యారు. ఇదిలా ఉండగా, ఈ కేసు దర్యాప్తులో జరుగుతున్న జాప్యంపై ఈ నెల 4న న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో న్యాయమైన, సత్వర నిష్పాక్షికమైన దర్యాప్తు చేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)లను ఆదేశించింది.

**అనిల్? అంబానీకి ఈడీ నోటీసులు**

మరోవైపు, ఫిబ్రవరి 26న అనిల్? అంబానీ విచారణకు హాజరుకావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తాజాగా సమన్లు ??జారీ చేసిందని గురువారం అధికారిక వర్గాలు తెలిపాయి. అనిల్ అంబానీ భార్య టీనా అంబానీ ఈడీ విచారణకు ఈ నెల 17న హాజరు కావాల్సి ఉండగా, మళ్లీ గైర్హాజరు అయ్యారు.

# బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో అనైతిక ప్రవర్తనకు అవకాశం అపరిమితంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసమే ఏఐ వినియోగానికి సమగ్ర రోడ్ మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మానవ విలువలు, సరైన మార్గదర్శకత్వం లేకుండా సాంకేతికతను ఉపయోగిస్తే అది స్వీయ విధ్వంసకరంగా మారవచ్చని హెచ్చరించారు. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు తప్పనిసరిగా మానవ విలువలు, స్పష్టమైన దిశ ఉండాలని చెప్పారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా నిర్వహించిన లీడర్స్ ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. డేటా సార్వభౌమత్వాన్ని గౌరవించడం సహా పారదర్శక భద్రతా నియమాలను రూపొందించాలని సూచించారు. "భారత్ బుద్ధుడు జన్మించిన దేశం. సరైన ఉద్దేశం ఉంటేనే సరైన నిర్ణయాలు ఉంటాయని బుద్ధుడు చెప్పారు. అందుకోసమే అందరూ కలిసి ఏఐని సరిగ్గా వినియోగించుకునేందుకు సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను అనైతిక పద్ధతిలో వాడుకునేందుకు అపరిమిత అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటిని అరికట్టేలా ఏఐ కంపెనీలు చర్యలు తీసుకోవాలి. మనకు బ్లాక్ బాక్స్‌కు బదులుగా గ్లాస్ బాక్స్ విధానం అవసరం. అందులో భద్రతా నియమాలను ధ్రువీకరించవచ్చు. జవాబుదారీతనం మరింత స్పష్టంగా మారుతుంది. వ్యాపారంలో నైతిక ప్రవర్తన కూడా మెరుగపడుతుంది. మనం ూ×కి ఆకాశమే హద్దుగా ఎదిగే ఆకాశాన్ని ఇవ్వాలి, కానీ అదే సమయంలో మన చేతుల్లోనే పగ్గాలు ఉంచుకోవాలి. కృత్రిమ మేధస్సు అనేది ఒక




పరివర్తనాత్మక శక్తి. దీనికి సరైన దిశానిర్దేశం లేకపోతే, అది ఒక పెను వినాశకారిగా మారుతుంది. అదే దానికి సరైన దిశ దొరికితే, అద్భుతమైన పరిష్కారంగా మారుతుంది. ఏఐని యంత్ర-కేంద్రక విధానం నుంచి మానవ-కేంద్రక విధానంగా ఎలా మార్చాలి, దానిని సున్నితంగా, బాధ్యతాయుతంగా ఎలా తీర్చిదిద్దాలి అనేదే ఈ గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రాథమిక లక్ష్యం."

దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గూగుల్, ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సీఈవోలు సుందర్ పిచాయ్, సామ్ ఆల్ట్‌మన్, డారియో అమోడీ సహా పలువురు ప్రపంచ టెక్ దిగ్గజాలతో మోదీ గ్రూప్ ఫోటో దిగారు. ఈ సదస్సుకు ఐరాస చీఫ్ అంటోనియో గుటెరెస్, ఫ్రాన్స్, బ్రెజిల్, శ్రీలంక అధ్యక్షులు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, లులా డాసిల్వా, అనుర కుమార దిసానాయకే సహా భూటాన్, ఫిన్లాండ్, మారిషస్, క్రొయేషియా, సీషెల్స్, సెర్బియా, ఎస్టోనియా దేశాల అధినేతలు హాజరయ్యారు.

**మానవ్ విజన్ ఉండాలని చెప్పిన ప్రధాని మోదీ**

అంతకుముందు కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ (పీూచీూం) విజన్' ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఆయన వివరించారు.

మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్: నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి.

అకౌంటబుల్: పారదర్శక నిబంధనలు రూపొందించి, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేసేలా చూడాలి.

నేషనల్ సావర్నిటీ: ఒక దేశంలో సృష్టించిన డేటా ఆ దేశానికే చెందాలి. ఆ దేశ పరిధిలోనే ఉండేలా చూడాలి.

యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పని చేయకుండా అన్నివర్గాల వారికీ అందుబాటులోకి రావాలి.

వేలిడ్ అండ్ లెజిటిమేట్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్? చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి.

**ప్రధాని మోదీ ప్రశంసలు**

ఈ క్రమంలోనే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సామర్థ్యాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. అనేక గడ్డు పరిస్థితులను దాటుకుని భారత్? ఇప్పుడు సులభంగా లావాదేవీలు నిర్వహిస్తుందని గుర్తుచేశారు. డిజిటల్? అంతరాన్ని తగ్గించడంలో? యూపీఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు.

# ఉచిత పథకాల వల్ల రాష్ట్రాల అభివృద్ధికి విఘాతం

దేశంలో పెరుగుతున్న ఉచిత పథకాల సంస్కృతిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని వ్యాఖ్యనించింది. రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్-2024లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరఫున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్నవారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సీజేఐ ప్రశ్నించారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్? సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ



చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉండి కూడా డబ్బు పంపిణీ చేయడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధులను సాగునీరు, విద్యుత్ వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు ఎందుకు కేటాయించకూడదని అడిగారు. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ (నగదు బదిలీ) విధానాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ప్రజలు గౌరవంగా బతకడానికి మీరు ఉపాధి మార్గాలను సృష్టించాలి. ఉదయం లేచినప్పటి నుంచి ఉచిత ఆహారం, గ్యాస్, విద్యుత్ ఇస్తూ నేరుగా ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంటే, ప్రజలు ఎందుకు పని చేస్తారు? ప్రతిదీ ఉచితంగా దొరుకుతున్నప్పుడు వారు ఏం పని చేస్తారు. మనం చేస్తున్నది దేశ నిర్మాణమేనా?' అని సీజేఐ ప్రశ్నించారు.

"మేము కేవలం తమిళనాడు గురించి మాత్రమే మాట్లాడటం లేదు. ఇది దేశం మొత్తానికి సంబంధించిన విషయం. మనం ఎలాంటి సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాం. విద్యుత్ బిల్లులు చెల్లించగలిగే వారు, అట్టడుగు వర్గాల మధ్య వ్యత్యాసం ఏది? ఒక సంక్షేమ ప్రభుత్వంగా అట్టడుగు వర్గాలకు ఉపశమనం కలిగించాలనుకోవడం మంచిదే. కానీ, చెల్లించే స్థోమత ఉన్నవారిని, లేనివారిని మధ్య ఎటువంటి వ్యత్యాసం చూపకుండా పంపిణీ చేయడం సంతృప్తిపర్చే విధానం కాదా?. దేశవ్యాప్తంగా ఇలా జరుగుతుండటం చూస్తుంటే, మాకు కూడా కొన్నిసార్లు బాధేస్తుంది" - సీజేఐ

**లాభాపేక్ష వద్దు- స్థోమత ఉన్న వారి నుంచి వసూలు చేయండి**

దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికే రెవెన్యూ లోటుతో ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను పక్కనబెట్టి ఉచితాల పంపిణీ చేయడం ఆర్థిక వ్యవస్థకు భారం అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆదాయ మిగులు రాష్ట్రం అయినప్పటికీ, ఆ మొత్తాన్ని రోడ్లు, ఆసుపత్రులు,పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన బాధ్యత మీకు లేదా? అని తమిళనాడు ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. పిల్లలకు విద్య అందించడం, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన పేద విద్యార్థులకు సహాయం చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, అయితే సంపన్నులకు కూడా ఉచితాలు అందడంపై సీజేఐ ప్రశ్నలు కురిపించారు. ఇలాంటి విధానపరమైన అంశాలను రాష్ట్రాలు పునఃసమీక్షించాల్సిన సమయం ఆసన్నం కాలేదా? అని అడిగారు. సేవలు పొందే వ్యక్తి తప్పనిసరిగా చెల్లింపులు చేయాలనేది ప్రాథమిక సూత్రమని సీజేఐ పేర్కొన్నారు. రాష్ట్రాలు లాభాపేక్షతో ఉండాలని తాము చెప్పడం లేదని, కనీసం స్థోమత ఉన్న వారి నుంచి ఖర్చులనైనా వసూలు చేయాలని సూచించారు.

# 'ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర'

దిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితర టెక్ దిగ్గజాలు కీలక ప్రసంగం చేశారు. ఏఐ రంగంలో భారత్ పాత్ర గురించి వ్యాఖ్యానించారు. భారత్‌లో తమ సంస్థ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతోందని, అందులో భాగంగా పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. అలాగే దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ చేరేలా చేయడమే తమ లక్ష్యమని టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు.

**ఏఐ భవిష్యత్‌ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్**

ఈ సదస్సుకు తనను ఆహ్వానించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్. ఈ క్రమంలో గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

**దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్**

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు



వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

**ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్**

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు.

**'ప్రపంచంలో సగం డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే'**

అలాగే 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థను భారత్ కలిగి ఉందని ఎన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయని అన్నారు. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని మోదీ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందని చెప్పారు.

**118 దేశాలు హాజరు**

గ్లోబల్ సౌత్‌లో మొదటిసారి జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో 118 దేశాలు పాల్గొన్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏఐ సదస్సు ఇదేనని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసిన దేశాధినేతలు, నాయకులు, టెక్ నిపుణులకు ధన్యవాదాలు వెల్లడించారు. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించారని చెప్పారు.

**ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ**

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అందుకే ఇటీవల వారంలో బెంగళూరులో తాము ఒక కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేసుకున్నారు. అలాగే ఆంత్రోపిక్ ఇండియా కార్యాలయానికి భారత్‌తో సుదీరఘ వ్యాపార అనుభవం ఉన్న ఇరినా ఘోస్‌ను ఎండీగా నియమించామని తెలిపారు. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయని హెచ్చరించారు. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు.

కాగా, దిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ సైతం పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధను ఉపయోగించుకోవడంలో దేశంలోని యువత ఆసక్తి చూపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137